నీలగిరి నిత్యపద్యం
ఆటవెలది
అపజయములు కలుగ యవనిలోనెపుడును
తప్పటడుగులనుచు తలచవలదు
అనుభవములె మనకు నగును గుణపాఠంబు
భవితలోన నవియె బనికివచ్చు

మీ
విజయప్రసాద్ నలమాసు
తెలుగు బోధకులు
----------------------------

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 108 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | గురువారం | 17-7-2025 | పేజిలు -8 | వెల: రూ. 5.00



## మోదీ చైనా పర్యటన ఫిక్స్..

- అయిదేళ్ల తర్వాత బీజింగ్ వెళ్లనున్న ప్రధాని
- గల్వాన్ లోయ ఘటన తర్వాత దెబ్బతిన్న ఇరుదేశాల సంబంధాలు
- ఆగస్ట్ 31న షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్ సదస్సు
- హాజరుకానున్న రష్యా అధ్యక్షుడు పుతిన్

న్యూఢిల్లీ

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వచ్చే నెలలో చైనాలో పర్యటించనున్నారు. చైనాలోని తియాంజిన్ వేదికగా షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్ సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు ప్రధాని మోదీ హాజరుకానున్నారని అధికారవర్గాల సమాచారం. ఇందుకోసం ఆగస్టు లేదా సెప్టెంబర్ లో మోదీ చైనాకు వెళతారని తెలిపాయి. లడఖ్ సరిహద్దుల్లో చైన భారత సైనికుల మధ్య ఘర్షణ తర్వాత -మిగతా 2 లో

## బనకచర్ల పై భేటీలో

# చర్చకు రాలేదు

### అపెక్స్ కమిటీ కాదు కనక ప్రస్తావించలే



- కృష్ణా, గోదావరి జలాలపై ఉన్నతస్థాయి కమిటీ
- టెలమెట్రీల ఏర్పాటుకు ఇరు రాష్ట్రాలు అంగీకారం
- సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి

న్యూఢిల్లీ,

తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా, గోదావరి జలాల అంశంలో ఉన్న సమస్యలపై చర్చించడానికి అధికారులు, ఇంజినీర్లతో కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆ కమిటీ నివేదిక మేరకు తదుపరి చర్యలు ఉంటాయన్నారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కేంద్ర జలశక్తిశాఖ నిర్వహించిన సమావేశం అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి -మిగతా 2 లో



## త్వరలో స్థానిక సంస్థల


# ఎన్నికల షెడ్యూల్

### ఎంపిటిసి,జడ్పీటిసీ స్థానాల ఖరారు

- 12,778 గ్రామ పంచాయతీలు, 1.12 లక్షల వార్డులు
- రాష్ట్రంలో మొత్తం 31 జడ్పీ స్థానాలు 566 ఎంపీపీ, జడ్పీటీసీ, 5,773 ఎంపీటీసీ స్థానాలు

హైదరాబాద్

త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడనున్న నేపథ్యంలో ప్రభుత్వం జడ్పీటీ-సీ, ఎంపీపీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీ స్థానాలను ఖరారు చేస్తూ ప్రకటన చేసింది .జడ్పీటీసీ, ఎంపీటీ-సీ స్థానాలను తెలంగాణ ప్రభుత్వం ఖరారు చేసింది. రాష్ట్రంలో మొత్తం 31 జడ్పీ స్థానాలు, 566 ఎంపీపీ, జడ్పీటీ-సీ స్థానాలు.. 5,773 ఎంపీటీసీ స్థానాలు ఉన్నట్లు- తెలిపింది. 12,778 గ్రామ పంచాయతీలు, 1.12 -మిగతా 2 లో







## తెలుగు రాష్ట్రాల జలవివాదాలకు చెక్

- ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటుకు అంగీకారం
- సీఆర్ పాటిల్ అధ్యక్షతన ఇరు రాష్ట్రాల సీఎంల భేటీ
- ఇచ్చిపుచ్చుకునే వాతవరణంలో చర్చలు జరిగాయన్న నిమ్మల

న్యూఢిల్లీ,

తెలుగు రాష్ట్రాల మధ్య జలవివాదాల పరిష్కారానికి అడుగు పడింది. చర్చల ద్వారా పరిష్కరించుకోవడంతో పాటు కమిటీ ఏర్పాటు చేసి ముందుకు సాగాలని నిర్ణయించారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ ఆధ్వరంలో జరిగిన భేటీ సుహృద్భావ వాతావరణంలో జరిగింది.. జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన ఉన్నతస్థాయి సమావేశం జరిగింది.. ఈ సమావేశానికి రెండు తెలుగు రాష్ట్రాల సీఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి.. -మిగతా 2 లో



## ఈ నెల 21 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు..

- ఎనిమిది బిల్లులను ప్రవేశపెట్టనున్న కేంద్రం..!

న్యూఢిల్లీ,

ఈ నెల 21 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో ప్రభుత్వం ఎనిమిది కొత్త బిల్లులను పార్లమెంట్‌కు సమర్పించనున్నది. ఇందులో మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనకు సంబంధించిన బిల్లు సైతం ఉన్నది. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను పొడిగించాలని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ప్రస్తుతం ఈ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనను తొలగించే ఉద్దేశం కేంద్రానికి లేదని తెలుస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 13న మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించిన విషయం తెలిసిందే. రాష్ట్రపతి పాలన కోసం ప్రభుత్వం ప్రతి ఆరునెలలకోసారి పార్లమెంట్ ఆమోదం పొందాల్సి ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్రపతి పాలన గడువు ఆగస్టు 13తో ముగియనున్నది.అలాగే పార్లమెంట్ సమావేశాల్లో ప్రభుత్వ మణిపూర్ వస్తువులు, సేవల పన్ను (సవరణ) బిల్లు 2025, పబ్లిక్ ట్రస్ట్ -మిగతా2 లో



## నిధులు రాహుల్‌కు నీళ్లు బాబుకు

- బూడిద తెలంగాణ ప్రజలకు
- ఎక్స్ వేదికగా కేటీఆర్ వ్యంగ్య విమర్శలు

హైదరాబాద్,

న్యూఢిల్లీలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్.. తన ఎక్స్ ఖాతా వేదికగా బుధవారం స్పందించారు. ముసుగు వీడింది, నిజం తేటతెల్లమయ్యిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి 48వ ఢిల్లీ పర్యటన గుట్టు రట్టయ్యిందని వ్యంగ్యంగా పేర్కొన్నారు. నిధులు రాహుల్ గాంధీకి, నీళ్లు చంద్రబాబుకి అన్నారు. తెలంగాణా వ్యతిరేకిని ముఖ్యమంత్రిగా గెలిపించినందుకు.. బూడిద తెలంగాణ ప్రజలకి! అని తెలిపారు. బనకచర్ల గురించి చర్చే రాలేదని బుకాయించి.... గురుదక్షిణగా గోదావరి జలాలను అప్పచెప్పడం కోసమా నువ్వు గద్దెనెక్కింది? అంటూ సీఎం రేవంత్ రెడ్డిని -మిగతా 2 లో

## హైదరాబాద్ శివారులో

# వెయ్యి కోట్ల భూ కుంభకోణం

- అత్తగారి సొమ్ములా సర్కారు భూమికి సూటీ
- సర్వే నంబరు 180లోని సర్కారు భూమికి యాజమాన్య హక్కులు ఇప్పిస్తామంటూ మోసం
- నకిలీ పత్రాలు సృష్టించి వెయ్యి కోట్ల భూమి పట్టా
- బిఆర్ఎస్ పెద్దల అండదండలతో వ్యూహం
- "నీలగిరి ఎక్స్ ప్రెస్ " ప్రత్యేక కథనం

హైదరాబాద్,జులై 16 (నీలగిరి ఎక్స్ ప్రెస్)

800 నుంచి వెయ్యి కోట్ల రూపాయలు విలువచేసే భూముల్ని అత్తగారి సొమ్ములా కొట్టేశారు. హైదరాబాద్ శివారులో మొయినాబాద్ పురపాలిక పరిధిలోని ఎన్కేపల్లి సమీపంలో భూ కుంభకోణం వెలుగు చూసింది. సర్వే నంబరు 180లోని సర్కారు భూమికి యాజమాన్య హక్కులు ఇప్పిస్తామంటూ దళారులు మోసగించినట్లు రెవెన్యూ అధికారుల విచారణలో బయటపడుతోంది. నకిలీ పత్రాలు సృష్టించి వెయ్యి కోట్ల రూపాయల మేర దోచుకున్నట్టు స్పష్టమవుతోంది. మొయినాబాద్ దగ్గర గోశాల నిర్మాణానికి -మిగతా 2 లో

**తెరవెనుక బిఆర్ఎస్ హస్తం..!**





# బనకచర్లపై భేటీలో చర్చకు రాలేదు

(మొదటి తరువాయి)

ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో ఏపీ ప్రభుత్వం నుంచి గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు కడతామన్న ప్రతిపాదన చర్చకు రాలేదని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. అజెండాలో వారు కడతామనే ప్రతిపాదనే చర్చకు రానప్పుడు ఆపాలన్న చర్చే ఉండదన్నారు. ఇది అపెక్స్ కమిటీ భేటీ-కాదని చెప్పారు. తెలంగాణ హక్కులను కేసీఆర్ గతంలో ఏపీకి ధారాదత్తం చేశారు. ఆయన చేసిన తప్పులను సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నాం. పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఈ సమావేశం జరిగింది. ఈ భేటీలో కేంద్ర ప్రభుత్వం కేవలం నిర్వాహక పాత్రే పోషించింది. కేంద్రం ఎవరివైపూ మాట్లాడలేదని రేవంత్‌రెడ్డి అన్నారు. అంతకుముందు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. అన్ని రిజర్వాయర్లు, కెనాల్స్ వద్ద యుద్ధప్రాతిపదికన టెలీమెట్రీలు ఏర్పాటు చేసేందుకు ఏపీ ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. కృష్ణా నదీజలాల వాడకం లెక్కలపై అనుమానాలున్నాయి. టెలీమెట్రీలు ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరాం. కేంద్రం నిధులు ఇవ్వకపోయినా రాష్ట్రమే నిధులు కేటాయిస్తుందని చెప్పాం. వీటి ఏర్పాటుపై గత ప్రభుత్వం అలసత్వం ప్రదర్శించింది. ఈ భేటీ- సందర్భంగా టెలీమెట్రీలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

## మోదీ చైనా పర్యటన ఫిక్స్..

(మొదటి తరువాయి)

తొలిసారి ప్రధాని మోదీ చైనాలో పర్యటించనున్నారని జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. తియాంజిన్ సిటీలో ఆగస్టు 31 నుంచి సెప్టెంబరు 1 తేదీ వరకు ఎస్ సీవో సమిట్ జరగనుంది. ఈ సమావేశంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, భారత్ తరఫున ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ తదితరులు పాల్గొంటారు. ఈ సదస్సు సందర్భంగా జిన్ పింగ్ తో ప్రధాని మోదీ చర్చలు జరపనున్నట్లు సమాచారం. ఇందులో పలు ద్వైపాక్షిక అంశాలతో పాటు సరిహద్దు సమస్యలపైనా చర్చించనున్నారు..తొలిసారిగా 2015లో ప్రధాని హోదాలో మోదీ తొలిసారి బీజింగ్ లో పర్యటించారు. ఆ తర్వాత కాలంలో ఇప్పటి వరకు మోదీ మొత్తం ఐదుసార్లు చైనాకు వెళ్లారు. 2020లో గల్వాన్ లోయలో ఇరుదేశాల సైనికుల మధ్య ఘర్షణ నెలకొంది. ఇరువైపులా సైనికులు చనిపోయారు. దీంతో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. అప్పటి నుంచి ప్రధాని మోదీ చైనాలో పర్యటించలేదు. తాజాగా భారత్ చైనాల మధ్య సంబంధాలను పునరుద్ధరించేందుకు చర్చలు జరుగుతున్నాయి. రెండు రోజుల క్రితం భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ బీజింగ్ కు వెళ్లారు. చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ తో భేటీ అయ్యారు. రెండు దేశాల మధ్య చోటుచేసుకున్న ఇటీవలి పరిణామాల గురించి చర్చించారు.

## త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్

(మొదటి తరువాయి)

లక్షల వార్డులు ఉన్నట్లు పేర్కొంది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల కోసం పంచాయతీ రాజ్ శాఖ సన్నాహాలు చేస్తోంది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లా పరిషత్ టెరిటోరియల్ కాన్‌స్టిట్యూఎన్సీలు, మండల పరిషత్ టెరిటోరియల్ కాన్‌స్టిట్యూన్సీ స్థానాల సంఖ్యను ఖరారు చేసింది. మొత్తం 566 జడ్పీటీసీ, మండల ప్రజా పరిషత్ స్థానాలు, అలాగే 5,773 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయం రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు మార్గం సుగమం చేసిందని చెప్పవచ్చు. ఈ స్థానాలు ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో ఉన్నాయి. అయితే, ఈసారి జడ్పీటీ-సీ, ఎంపీపీ స్థానాల సంఖ్య 539 నుంచి 566కి పెరిగింది. ఇది 31 జిల్లా పరిషత్‌లలో నిర్వహించబడుతుంది. ఎంపీటీసీ స్థానాల సంఖ్య కూడా 5,817 నుంచి 5,773కి కొద్దిగా తగ్గింది.ఈ ఎన్నికలను ఆగస్టులో జడ్పీటీ-సీ, ఎంపీటీ-సీ స్థానాలకు, సెప్టెంబరులో గ్రామ పంచాయతీలకు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 రిజర్వేషన్‌ను అమలు చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం రాష్ట్ర జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించడానికి తీసుకున్న చర్యగా చెప్పవచ్చు. ఈ రిజర్వేషన్ విధానం కింద గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మండల యూనిట్లుగా, ఎంపీపీలు, జడ్పీటీ-సీలు జిల్లా యూనిట్లుగా, జడ్పీ చైర్పర్సన్‌లు రాష్ట్ర యూనిట్‌గా పరిగణించబడతాయి. ప్రభుత్వం ఈ రిజర్వేషన్‌ను అమలు చేయడానికి ఒక ఆర్డినెన్స్ జారీ చేయనుంది. దీనిని రాష్ట్ర గవర్నర్‌కు పంపించారు. ఈ ఆర్డినెన్స్ చట్టపరమైన సవాళ్లను ఎదుర్కొనే అవకాశం ఉన్నందున, ప్రభుత్వం హైకోర్టు, సుప్రీంకోర్టులో కేవియట్‌లను దాఖలు చేయడానికి సన్నాహాలు చేస్తోంది. ఈ ఎన్నికలు రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు కీలక పోటీ-గా ఉంటాయి. ఈ ఎన్నికల ద్వారా కాంగ్రెస్ పార్టీ గ్రామీణ స్థాయిలో తమ పట్టును బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

## ఈ నెల 21 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు..

(మొదటి తరువాయి)

(నిబంధనల సవరణ) బిల్లు 2025, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (సవరణ) బిల్లు 2025, పన్ను చట్టాలు (సవరణ) బిల్లు 2025, జియో-హెరిటేజ్ సైట్స్ అండ్ జియో-రిమైన్లు (సంరక్షణ-నిర్వహణ) బిల్లు 2025, గనులు-క్వారీలు (అభివృద్ధి-నియంత్రణ) సవరణ బిల్లు 2025, జాతీయ క్రీడా పరిపాలన బిల్లు 2025, జాతీయ డోపింగ్ నిరోధక (సవరణ) బిల్లు 2025లను కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టి ఆమోదం పొందాలని చూస్తున్నది. దాంతో పాటు గోవా రాష్ట్ర శాసనసభ నియోజకవర్గాల్లో షెడ్యూల్డ్ తెగల ప్రాతినిధ్య పునర్వ్యవస్థీకరణ బిల్లు 2024, మర్చంట్ షిప్పింగ్ బిల్లు 2024, ఇండియన్ పోర్ట్స్ బిల్లు 2025, ఆదాయపు పన్ను బిల్లు 2025 కూడా లోక్‌సభలో ఆమోదం పొందే అవకాశాలున్నాయి. ఏప్రిల్ నెలలో ముగిసిన పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ఉభయ సభల్లో కేంద్రం 16 బిల్లులను ఆమోదించాయి. బడ్జెట్ సమావేశాల్లో గందరగోళం నెలకొన్న విషయం తెలిసిందే, కానీ, జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) నివేదిక సమర్పించిన తర్వాత.. వక్ఫ్ (సవరణ) బిల్లు 2025 ఆమోదం పొందింది.

# తెలుగు రాష్ట్రాల జలవివాదాలకు చెక్

(మొదటి తరువాయి)

నీటిపారుదల శాఖ మంత్రులు నిమ్మల రామానాయుడు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి హాజరయ్యారు.. గోదావరి, కృష్ణా జలాల వినియోగం, ప్రాజెక్టుల నిర్మాణాలపై చర్చ సాగింది.. గంటన్నరపాటు సాగిన ఈ భేటీ ముగిసిన తర్వాత ఏపీ నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మీడియాతో మాట్లాడుతూ.. సమావేశంలో జరిగిన చర్చలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.. ఇచ్చిపుచ్చుకునే వాతావరణంలో చర్చలు జరిగాయని తెలిపారు మంత్రి నిమ్మల.. తెలుగు ప్రజలంతా ఒక్కటే అనే స్ఫూర్తితో ఈ రోజు చర్చలు జరిగాయి. మూడు అంశాలపై నిర్ణయాలు జరిగాయి.. రిజర్వాయర్ల ద్వారా బయటకు వెళ్లే నీటిని లెక్కలు వేసేందుకు టెలిమెట్రీ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారని వెల్లడించారు.. శ్రీశైలం ప్రాజెక్టు తెలుగు ప్రజల ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్.. శ్రీశైలం ప్రాజెక్ట్ కు మరమ్మత్తులు సత్వరమే చేపట్టాలని నిర్ణయించారు.. గోదావరి నదీ నిర్వహణ బోర్డు కార్యాలయం హైదరాబాద్ లో, కృష్ణా నదీ నిర్వహణ బోర్డు కార్యాలయం అమరావతిలో పెట్టాలని నిర్ణయం తీసుకున్నట్టు- పేర్కొన్నారు నిమ్మల రామానాయుడు.. ఇక, తెలంగాణ ప్రస్తావించిన పలు అంశాల్లో సాంకేతిక అంశాలు ఇమిడి ఉన్నాయి.. కాబట్టి, ఈ సమస్యల పరిష్కారానికి కేంద్రం నేతృత్వంలో ఇరు రాష్ట్రాలకు చెందిన సాంకేతిక నిపుణులు, పాలనాపరమైన అధికారులతో కూడిన ప్రత్యేక కమిటీ- ఏర్పాటు- చేయాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. బనకచర్ల ప్రాజెక్ట్ తో పాటు, ఇతర అన్ని అంశాలను కూడా ఈ ప్రత్యేక కమిటీ- పరిశీలించి నిర్ణయాలు తీసుకుంటుంది. జాప్యం లేకుండా, వచ్చే సోమవారం కల్లా ఈ కమిటీ- ఏర్పాటు- చేయాలని కూడా నిర్ణయం తీసుకున్నట్టు- తెలిపారు. తెలుగు రాష్ట్రాల మధ్య జల వివాదాలపై నిపుణులతో కమిటీ- ఏర్పాటు- చేస్తామని కేంద్రం జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ స్పష్టం చేశారని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. ఈ కమిటీని సోమవారం లోపు ఏర్పాటు చేస్తామన్నా రన్నారు. ఈ కమిటీలో కేంద్ర, రాష్ట్రాల నిపుణులు ఉంటారని చెప్పారన్నారు. ఈ సమావేశం ఆహ్లాదకర వాతావరణంలో జరిగిందన్నారు. ఇరు రాష్ట్రాలు ఇచ్చి పుచ్చుకొనే ధోరణిలో చర్చలు జరిగాయని తెలిపారు. శ్రీశైలం ప్రాజెక్టును కాపాడుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఆ క్రమంలో శ్రీశైలం ప్రాజెక్టు మరమ్మతులు, రక్షణ చర్యలపై ఈ సందర్భంగా చర్చించామన్నారు. నిపుణుల కమిటీ- నివేదిక ఆధారంగా చర్యలు చేపడతామని కేంద్ర మంత్రి స్పష్టం చేశారని పేర్కొన్నారు. కృష్ణా నది బోర్డు అమరావతిలో ఉండేలా నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. అలాగే గోదావరి బోర్డు తెలంగాణలో ఏర్పాటు- చేసేలా నిర్ణయించామని తెలిపారు. శ్రీశైలం ప్రాజెక్ట్ మరమ్మతులు చేసేందుకు ఏపీ అంగీకారించిదన్నారు. అలాగే -టె-లిమెట్రీ- ఏర్పాటు-కు సైతం అంగీకరించామని మంత్రి నిమ్మల వివరించారు. తెలుగు రాష్ట్రల జల వివాదాలపై సుమారు గంటన్నర పాటు- ఈ సమావేశం జరిగింది. అయితే ఈ సమావేశంలో పోలవరం- బనకచర్ల ప్రాజెక్ట్ ఆవశ్యతను సీఎం చంద్రబాబు వివరించినట్లు- తెలుస్తుంది. గోదావరి నుంచి సముద్రంలోకి ఏటా 2 వేల నుంచి 3 వేల టీ-ఎంసీల నీరు సముద్రంలో కలుస్తాయని తెలిపారు. ఈ నీటిని బనకచర్ల ద్వారా రాయలసీమకు మళ్లిస్తే ఆ ప్రాంతానికి లబ్ది చేకూరుతోందని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు సోదాహరణగా ఈ భేటీలో వివరించారని సమాచారం.అలాగే అందుకు సంబంధించిన సమగ్ర వివరాలను సైతం కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు ఆయన అందజేశారు. ఏ ఒక్క రాష్ట్రనికి ఇబ్బంది కలిగించకుండా.. సముద్రంలోకి వెళ్లే గోదావరి మిగులు జలాలను మాత్రమే వినియోగించుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని ఈ సమావేశంలో సీఎం చంద్రబాబు స్పష్టం చేసినట్లు- తెలుస్తుంది. ఇక తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన ఎజెండాలోని 13 అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఆ ప్రాజెక్ట్‌ల విషయంలో సీఎం చంద్రబాబు ఎటువంటి అభ్యంతరం తెలపలేదని తెలుస్తుంది.

## ఏసీబీ వలలో పంచాయతీరాజ్ చీఫ్ ఇంజినీర్

### లంచం తీసుకుంటుండగా కనకరత్నం పట్టివేత



హైదరాబాద్ జూలై 16 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్)

తెలంగాణ పంచాయతీరాజ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ కనకరత్నం ఏసీబీ వలలో చిక్కారు. డీఈ బదిలీ విషయంలో ఆయన రూ. 50వేలు డిమాండ్ చేశారు. లంచం డబ్బు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ ఏడాది మార్చి 31న కనకరత్నం పదవీవిరమణ పొందారు. అయితే, ప్రభుత్వం ఆయన పదవీకాలాన్ని మరో ఏడాదిపాటు- పొడిగిచింది. కాగా సొంత శాఖలోని డీఈ తాండూరు నుంచి వికారాబాద్‌కు బదిలీ చేయాలని కోరగా.. కనకరత్నం రూ.50వేలు లంచం అడిగారు. దీంతో డీఈ ఏసీబీని ఆశ్రయించారు. దీంతో కనకరత్నం లంచం తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పంచాయతీ రాజ్ కార్యాలయంతోపాటు- కేపీహెచ్‌బీ కాలనీలోని ఆయన నివాసంలోనూ సోదాలు నిర్వహించారు. భారీగా నగదు, ఆస్తులు గుర్తించినట్లు తెలుస్తోంది. తరం కనకరత్నంను అరెస్టు చేసినట్లు- ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ వెల్లడించారు.

## నిధులు రాహుల్‌కు. నీళ్లు బాబుకు



(మొదటి తరువాయి)

కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. జై తెలంగాణ అనడానికి ఉన్న సిగ్గు.... నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల హక్కులను చంద్రబాబుకి ధారపోయడానికి మాత్రం లేదా? అంటూ సీఎం రేవంత్ రెడ్డిని కేటీ-ఆర్ నిలదీశారు. కోవర్టులు ఎవరో, తెలంగాణ కోసం కొట్లాడిన వారు ఎవరో...ఈ రోజుతో తేలిపోయిందని స్పష్టం చేశారు. నీ గురువుపై విశ్వాసం చూపించడానికి.. తెలంగాణ విధ్వంసం కావలసిందేనా? అంటూ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకెందుకు రెండు రాష్ట్రాలు, ఇద్దరు ముఖ్యమంత్రులు? నిన్ను ఎన్నుకున్న పాపానికి.. చెరిపేయి సరిహద్దులు! అంటూ సీఎం రేవంత్ రెడ్డికి సూచించారు. తెలంగాణా మీద నీ అక్కసు చల్లారుతుందేమో! జై తెలంగాణా అనాల్సిన బాధ నీకు తప్పుతుందేమో!.. ఒక్క మాట గుర్తు పెట్టు-కో.. ఒక్క బొట్టు- నీరు అక్రమంగా అప్పజెప్పినా, మరో పోరాటం చూస్తావంటూ సీఎం రేవంత్ రెడ్డికి కేటీ-ఆర్ ఘాటు-గా వ్యాఖ్యానించారు. ప్రాంతేతరుడు మోసం చేస్తే తరిమి, తరిమి కొడతాం! ప్రాంతం వాడు మోసం చేస్తే ఇక్కడే పాతి పెడతాం! తెలంగాణను పీక్కుతింటు-న్న రాబందుల పని తప్పక పడతామని ఈ సందర్భంగా కేటీఆర్ హెచ్చరించారు.

## హైదరాబాద్ శివారులో వెయ్యి కోట్ల భూ కుంభకోణం..

(మొదటి తరువాయి)

ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేయడంతో.. ఈ కుంభకోణం బయటపడింది. హైదరాబాద్ శివార్లలో ప్రభుత్వం నిర్మించతలపెట్టిన గోశాల భూములపై స్థానిక రైతులకు, రెవెన్యూ అధికారుల మధ్య వివాదం నడుస్తోంది. మరోవైపు తప్పుడు పత్రాలతో ఈ భూములు కొల్లగొట్టేందుకు కొందరు ప్రయత్నిస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. విచారణ మొదలు పెట్టిన రెవెన్యూ అధికారులు.. ఈ భూముల వ్యవహారంలో ఇప్పటికే పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారినట్లు నిర్ధారణకు వచ్చారు. దీని వెనుక గత ప్రభుత్వ హయాంలోని కొందరు పెద్దలు ఉన్నట్లు తెలుస్తోంది. మొయినాబాద్ చుట్టుపక్కల ఎకరం 8కోట్ల రూపాయలు పలుకుతోంది. దీంతో ప్రభుత్వ స్థలాన్ని కాజేసేందుకు 2020లోనే దళారులు ఎంటరైనట్టు భావిస్తున్నారు. నాటి ప్రభుత్వ పెద్దల అండదండలతో వ్యూహం రచించారు. హైదరాబాద్కు చెందిన పలువురు వ్యాపారులకు ఎకరాల చొప్పున విక్రయానికి పెట్టినట్టు తెలుస్తోంది. స్థానికులకు విక్రయిస్తే తెలిసిపోతుందన్న ఉద్దేశంతో



స్థానికేతరులకు భూమిని అమ్మారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఈ భూమిని గోశాల నిర్మాణానికి కేటాయించింది. ఈనెల 7న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య భూమి పూజ చేశారు. దీంతో స్థానికంగా సాగు చేసుకుంటున్న రైతులు తమకు న్యాయం చేయాలంటూ ఆందోళన చేస్తున్నారు. ఎకరాకు 800 చదరపు గజాల స్థలాన్ని ఇప్పించాలని పట్టుపడుతున్నారు. ఈ విషయంలో రెవెన్యూ అధికారులు, రైతుల మధ్య చర్చలు జరుగుతున్నాయి. మరోవైపు, ఈ భూమిని తాము కొన్నామని, తమకు భూయాజమాన్య హక్కులున్నాయని కొందరు సంప్రదించారు. దీంతో కుంభకోణం వెనుక చాలామంది ఉన్నట్టు తేలింది.

# మహిళలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

▫ కప్పాటి పాండురంగా రెడ్డి



మహేశ్వరం,జూలై 16 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్)
మహిళా సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ఆదర్శంగా నిలుస్తుందని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగా రెడ్డి మహేశ్వరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అన్నారు . తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు మొదటి ప్రాధాన్యత కల్పించిన వారి అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తుంది. మహాలక్ష్మి పథకంతో రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తుంది. దీంతో పాటుగా 500కే గ్యాస్ సిలెండరు, గృహ జ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత కరెంట్, ఇందిరమ్మ ఇల్లు మహిళా సంఘాలకు పెట్రోల్ పంపుల కేటాయింపు లాంటి పథకాలతో పాటు తెలంగాణ ప్రభుత్వం మహిళా స్వయం సహాయక సంఘాల (SHG) సభ్యులను బలోపేతం చేయడానికి కృషి చేస్తోంది. వారికి తక్కువ వడ్డీకే రుణాలు, ఆర్థిక సహాయం అందిస్తోంది. మహిళా సంఘాలకు చేయూతలో భాగంగా వారు తీసుకున్న రుణాలకు వడ్డీని ప్రభుత్వమే చెల్లించేందుకు వీలుగా ఈ పథకాన్ని అమలు చేస్తోంది. ఇందుకు ప్రభుత్వం ఇటీవల రూ.344 కోట్లను గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్)కి విడుదల చేసింది. ఇందులో రూ.300 కోట్లు గ్రామీణ మహిళాసంఘాలకు, రూ.44 కోట్లు పట్టణ మహిళా సంఘాలకు చెల్లిస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో శనివారం వరకు చెక్కులను పంపిణీ చేస్తారు. ఆ వెంటనే ఆయా సంఘాల ఖాతాల్లో ఈ నిధులు జమవుతాయి. మహిళా సంఘాల సభ్యులకు అమలు చేస్తున్న ప్రమాద, రుణబీమా పథకాల చెక్కులను సైతం పంపిణీ చేస్తుంది. మహిళా సంఘాల సభ్యులు ప్రమాదవశాత్తూ చనిపోతే బీమా పథకం కింద ఆమె కుటుంబానికి రూ.10 లక్షలు, రుణాలు తీసుకున్న వారు చనిపోతే వారి పేరిట ఉన్న రుణాల మాఫీని అమలు చేస్తోంది. ఏడాదిన్నరగా రాష్ట్రంలో చనిపోయిన 385 మంది సభ్యుల కుటుంబాలకు ప్రమాద బీమా, 2,502 మంది కుటుంబాలకు రుణ బీమా చెక్కులను పంపిణీ చేస్తుంది అని పాండురంగా రెడ్డి అన్నారు.

## 2025 జూలై 17, గురువారం తెలుగు పంచాంగం




మాసం -పక్షం
మాసం: ఆషాఢమాసం (అమాంత)
పక్షం: కృష్ణపక్షం ప్రారంభం
తిథి
పౌర్ణమి: జూలై 16 సా. 5:12 వరకు
ప్రతిపద: జూలై 16 సా. 5:12 నుంచి జూలై 17 సా. 4:34 వరకు
ద్వితీయ: జూలై 17 సా. 4:34 నుంచి జూలై 18 సా. 3:52 వరకు
నక్షత్రం
ఉత్తరఫల్గుని: ఉదయం 5:38 వరకు
హస్త: జూలై 17 ఉదయం 5:38 నుండి జూలై 18 ఉదయం 5:00 వరకు
శుభ సమయాలు
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:19 -5:05
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 12:01 - 12:52
అశుభ సమయాలు
రాహుకాలం: మధ్యాహ్నం 1:59 - 3:36
యమగండం: ఉదయం 6:31 - 8:08
దుర్ముహూర్తం: ఉదయం 10:11 - 11:04
వర్జ్యం: ఉదయం 6:25 - 8:09

## మనోహరాబాద్ తహశీల్దార్ గా ఆంజనేయులు



**మనోహరాబాద్, జూలై 16(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి బుధవారం తూప్రాన్ తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. కౌడిపల్లి మండల తహసీల్దార్ గా ఉన్న ఆంజనేయులు బదిలీపై మనోహరాబాద్ మండల తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

## రాములపల్లె పాఠశాలలో బాలికల సౌకర్యానికి కొత్త అధ్యాయం

▫ 6 లక్షల వ్యయంతో టాయిలెట్ నిర్మాణం




**ఎలిగేడు, జూలై 16(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మండలంలోని రాములపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుకునే బాలికల కోసం ప్రత్యేకంగా నిర్మించిన టాయిలెట్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ నిర్మాణం హైదరాబాద్‌కు చెందిన దా సేవ సమితి చైర్‌పర్సన్ గాయత్రి గుప్తా ఆధ్వర్యంలో, యశస్వి సహకారంతో రూ. 6 లక్షల వ్యయంతో చేపట్టారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి నరేంద్ర చారి ప్రత్యేక అతిథిగా హాజరై, టాయిలెట్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, "పాఠశాలల్లో బాలికల కోసం స్వచ్ఛమైన వాతావరణం కల్పించడం అత్యంత అవసరం. ఇలాంటి మౌలిక సదుపాయాల ద్వారా వారి హాజరు మెరుగవుతుంది, చదువులో ఆసక్తి పెరుగుతుంది" అని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, దా సేవ సమితి సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## వర్షం కోసం కప్పమ్మకు పూజలు

▫పాల్గొన్న ఎర్రోళ్ల రాఘవేందర్



**కడ్తాల్, జూలై 16(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వరుసగా వర్షాభావం కొనసాగుతున్న నేపథ్యంలో కడ్తాల్ గ్రామంలో వర్షాలు కురవాలని, రైతులకు పంటలు పండాలని గ్రామ ప్రజలు సంప్రదాయంగా కప్పమ్మకు పూజలు నిర్వహించారు. మహిళలు కప్పమ్మతో ఆటలు ఆడి, వరుని దేవునికి బోనం సమర్పిస్తూ భక్తిశ్రద్ధలతో వర్షాన్ని పిలవడం విశేషమైంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ యువజన సంఘాల ఐక్య వేదిక అధ్యక్షులు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్,వరీకుప్పల సత్యనారాయణ, నాగరాజు గౌడ్, గ్రామ మహిళలు తదితరులు పాల్గొని సమిష్టిగా వర్షం కురవాలని కోరుకున్నారు.

## ఎస్సీలకు స్థానాలు కేటాయించాలంటూ నాయకుల డిమాండ్




**దేవరకొండ, జూలై 16(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో దేవరకొండ నియోజకవర్గంలో రెండు ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలను ఎస్సీ సామాజిక వర్గానికి కేటాయించాలని ఎస్సీ నాయకులు ఆర్డీఓ రమణారెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నియోజకవర్గంలో మొత్తం 8 మండలాలు, ఒక మున్సిపాలిటీ ఉన్నాయని, దాదాపు 2.5 లక్షల ఓటర్లలో 50 వేలకుపైగా ఎస్సీ ఓటర్లు ఉన్నారని తెలిపారు.నియోజకవర్గం ఏర్పడినప్పటినుంచి ఎస్సీ వర్గానికి సరైన రాజకీయ ప్రాతినిధ్యం కలగలేదని, గత రెండు దశాబ్దాలుగా ఒక్కటైనా ఎంపీపీ లేదా జెడ్పీటీసీ స్థానం కేటాయించనట్లే ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం సామాజిక న్యాయాన్ని పాటిస్తూ, కనీసం రెండు స్థానాలను ఎస్సీ వర్గానికి కేటాయించాలని ఆర్డీవోని వారు కోరారు.గతంలో ఉన్న ఉమ్మడి ఐదు మండలాల్లోనూ రొటేషన్ ప్రక్రియలో అన్యాయమే జరిగిందని పేర్కొంటూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

## ఏసీబీకి చిక్కిన పంచాయతీరాజ్ ఇంజినీర్ ఇన్ చీఫ్




**హైదరాబాద్, జూలై 16(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హైదరాబాద్లో పంచాయతీరాజ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ కనకరత్నం ఏసీబీకి చిక్కారు. డీఈని బదిలీ చేసేందుకు కనకరత్నం రూ. 50వేలు డిమాండ్ చేశారు. సరిగ్గా ఆ లంచం డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఆయనను రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నారు. ఈ క్రమంలోనే ఎర్రమంజిల్లోని పంచాయతీరాజ్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు నిర్వహిస్తోంది. కొన్ని రోజుల క్రితమే ఆయన పదవీ విరమణ చేయగా.. ప్రభుత్వం ఆయన పదవీ కాలాన్ని ఏడాది పాటు పొడిగించింది.

## ఎడమ కాలువకు నీరు విడుదల చేయాలని రైతుల డిమాండ్




**మిర్యాలగూడ, జూలై 16(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
సాగర్ ఎడమ కాలువకు వెంటనే సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు బుధవారం స్థానిక ఎన్ఎస్పీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. 560 అడుగుల నీటి మట్టంతో సాగర్ ప్రాజెక్టు నిండే అవకాశం ఉందని, శ్రీశైలం నుండి వరదనీరు వస్తుండటంతో వానకాలం పంటలకు నీరు ఇవ్వాలని నేతలు కోరారు. ప్రాజెక్టులోని నీటిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని ఆరోపిస్తూ, ఎడమ కాలువకు న్యాయంగా నీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో పలువురు రైతు నాయకులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్, బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు




**ఎలిగేడు, జూలై 16(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వర్షాభావ పరిస్థితుల్లో రైతులకు కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా నీళ్లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం పెద్దపల్లి జిల్లా కేంద్రానికి వస్తున్న మంత్రులకు నిరసన తెలిపేందుకు బయలుదేరిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులను ఎలిగేడు ఎస్ఐ సత్యనారాయణ ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇందిరా మహిళ సంబరాల సభ సందర్భంగా ఈ చర్యలు తీసుకున్నారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తానిపర్తి మోహన్ రావు, బురాన్మయపేట మాజీ సర్పంచ్ రాచర్ల కొండయ్య, రాజా, తంగేళ్ల కుమార్ యాదవ్, బీజేపీ నాయకులు గాదె రంజిత్ రెడ్డి, రాయపాక మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

▫ ఎంపీడీవో భాస్కరరావు



**ఎలిగేడు, జూలై 16(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
గ్రామ ప్రత్యేక అధికారులు కార్యదర్శులు పారిశుద్ధంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీవో భాస్కరరావు అన్నారు. బుధవారం ఎంపీవోతో కలసి మండల స్థాయి అధికారుల గ్రామ ప్రత్యేక అధికారులు గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ముఖ్యంగా మంచినీటి సమస్య ఉండకూడదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కిరణ్ ఏఈ ఇరిగేషన్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# మిర్యాలగూడలో వారంలో రెండు రోజులు ప్రజావాణి



**మిర్యాలగూడ, జూలై 16(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష సమావేశం అనంతరం శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మీడియాతో మాట్లాడుతూ, ఇకపై ప్రతి బుధవారం, శనివారం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్టు ప్రకటించారు. అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, 100 రోజుల కార్యాచరణతో అభివృద్ధి పనులు వేగవంతం చేస్తామని తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి డ్రైనేజీ పూడిక తీత, విద్యాసంస్థల పరిశుభ్రత, మౌలిక వసతుల కల్పనపై చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా రాజీవ్ చౌక్ – ఈదులగూడ రోడ్డు వెడల్పు, నందిపాడు–%చింతపల్లి ఫ్లైఓవర్ల నిర్మాణం త్వరలో ప్రారంభమవుతుందని వెల్లడించారు. గంజాయి నివారణకు ప్రత్యేక తనిఖీలు, రాత్రి 11 తర్వాత రోడ్లపైకి వచ్చే వారు గుర్తింపు పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. పట్టణ శాంతిభద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు, భూ వివాదాల్లో రౌడీయిజంపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొత్త రేషన్ కార్డుల పంపిణీ కొనసాగుతుందని, అవసరమైతే కొత్త రేషన్ దుకాణాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని, ప్రజల సూచనలు స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నామని బీఎల్ఆర్ పేర్కొన్నారు. సమావేశంలో సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, డీఎస్పీ రాజశేఖర్ రాజు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఆర్ బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.


## పర్యావరణ పరిరక్షణ సమితి యొక్క లక్ష్యాలు మరియు మిషన్

లక్ష్యం
సుస్థిరమైన, ఆరోగ్యకరమైన జీవనవాతావరణం కోసంపర్యావరణాన్ని రక్షిస్తూ, ప్రజల ఆరోగ్యం, ఆయుష్షు పెంపుకు కృషి చేయడం.

పర్యావరణ పరిరక్షణ సమితి
చెట్టు = అమ్మ
Reg No. 643/2025
Nurture Nature, Promote Wellness

మిషన్
- శాస్త్రీయ పద్ధతుల్లో పర్యావరణ పరిరక్షణ
- గాలి, నీరు, నేలపై కాలుష్య నివారణ
- విద్య, సాంకేతికతతో ప్రజల్లో అవగాహన
- యువతకు పది వేల ఉద్యోగ అవకాశాలు
- అభివృద్ధి -పర్యావరణాన్ని సమతుల్యంగా ముందుకు నడిపించడం
- మాదకద్రవ్యాల రహిత భారత దేశ ఆవిష్కరణ
- భారతీయ సాంప్రదాయాల విస్తృత ప్రచారం


# పటేల్ రోడ్ మెయిన్ రోడ్డుకు మహర్దశ

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో 9 మీటర్ల వెడల్పు సీసీ రోడ్డు
- పనులను పరిరక్షించిన పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కే చెన్నయ్య
- ఎమ్మెల్యే నిర్ణయం పై మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వం హర్షం



**షాద్ నగర్, జూలై 16(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
షాద్ నగర్ పట్టణంలోని పటేల్ రోడ్డు ప్రముఖ రహదారి మెయిన్ రోడ్డు ను 9 మీటర్ల వెడల్పుతో సీసీ రోడ్డు నిర్మించడానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నిర్ణయం తీసుకున్నారు. మొదట నాలుగున్నర మీటర్ల రోడ్డును అధికారులు మంజూరు చేయగా ఒక కోటి రూపాయలు నిధులతో దీనిని నిర్మించేందుకు ముందుకు వచ్చారు అయితే.. మారుతున్న పరిణామాలు ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను పట్టణ అధ్యక్షుడు కే చెన్నయ్య, మజ్ మున్సిపల్ చైర్మన్ విశ్వం తదితరులు కలిసి సమస్యను వివరించారు దీంతో ఎమ్మెల్యే శంకర్ దీని పరిశీలించి తొమ్మిది మీటర్ల వెడల్పుతో రోడ్డు వేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు దీనికి సంబంధించి అదనపు నిధులను కూడా మంజూరు చేసేందుకు అంగీకరించారు. షాద్ నగర్ పట్టణ అధ్యక్షులు కొంకళ్ల చెన్నయ్య ఆధ్వర్యంలో పటేల్ రోడ్ ప్రధాన రోడ్డు విస్తరణ పనులను స్వయంగా బుధవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు షాద్ నగర్ మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు విశ్వం అప్ప, పట్టణ అధ్యక్షులు కొంకళ్ల చెన్నయ్య, సీనియర్ నాయకులు మన్నే రవి, యువ నాయకులు నీరటి వాసు, రాజమోని జగదీశ్వర్, రాజమోని నర్సింగ్ రాజ్, సుంకర సత్యనారాయణ, రాజమోని యాదగిరి, మన్నే పార్థు, అఫ్జల్ బాయ్, మార్కెట్ ఖలీమ్, దేవగిరి గణేష్, మున్సిపల్ అధికారులు మరియు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు..

# ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

- బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణను మర్యాదపూర్వకంగా కలిసిన ప్రజాప్రతినిధులు, కాలనీ సభ్యులు



**కుత్బుల్లాపూర్, జూలై 16(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని శంభీపూర్‌లో బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణను నియోజకవర్గానికి చెందిన తాజా మాజీ ప్రజాప్రతినిధులు, కాలనీ సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ప్రజా సమస్యలను వివరించి, పరిష్కారానికి సహకరించాలని కోరారు. శంభీపూర్ క్రిష్ణ సానుకూలంగా స్పందిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని తెలిపారు. మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద దృష్టికి తీసుకెళ్లి వారి సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. అదే విధంగా బాహాదుర్పల్లి ఇందిరమ్మ కాలనీలో మౌలిక వసతుల కల్పన కోసం తాజా మాజీ కౌన్సిలర్లు మైసిగారి వెంకటేష్, శివనూరి మల్లేష్, కాలనీ ప్రజలు కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలో తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాలు వంటి సదుపాయాలపై దృష్టి పెట్టాలని కోరారు. ఇక మల్లంపేట మాజీ ఎంపీటీసీ, తాజా మాజీ కౌన్సిలర్ మాదాస్ వెంకటేశం పుట్టినరోజు సందర్భంగా శంభీపూర్ క్రిష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.


# గజ్వేల్ లో బీజేపీలోకి భారీగా చేరికలు



**గజ్వేల్, జూలై 16(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో బుధవారం కొల్గూర్ గ్రామానికి చెందిన సర్పంచ్ స్వర్గీయ మల్లం రాజు సతీమణి మల్లం సుమతి, ఉప సర్పంచ్ మల్లేష్ గౌడ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు సత్తయ్య గౌడ్ మరియు ఇతర నేతలు మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ లో చేరడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు వారికి బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల విషయమై ఇందిరమ్మ ఇండ్లకు 60 గజాలు మాత్రమే ఉండాలి, పైన ఇంకో ఇల్లు కట్టకూడదు అన్నది కాంగ్రెస్ పార్టీ విధానం. కానీ బీజేపీ పార్టీ దీనిని వ్యతిరేకిస్తోంది. ఇళ్ల కోసం కేంద్ర బీజేపీ ప్రభుత్వం డబ్బులు ఇస్తోంది కానీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కేవలం తమ పార్టీకి చెందిన వారికే మంజూరు చేస్తుందని విమర్శించారు. గజ్వేల్‌కు రైల్వే స్టేషన్ నిర్మాణానికి రాష్ట్ర బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ రూపాయి ఖర్చు పెట్టలేదు. కేంద్ర బీజేపీ ప్రభుత్వమే మొత్తం నిధులను సమకూర్చింది. అలాగే సిద్దిపేట, గజ్వేల్ పట్టణాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి కూడా నరేంద్ర మోదీ గారి ప్రభుత్వమే నిధులు మంజూరు చేసింది అని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు మార్పును కోరిన విధంగా, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా అదే మార్పు కోసం ఉవ్విళ్లూరుతున్నారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో బిజెపి సిద్దిపేట జిల్లా అధ్యక్షులు భైరి శంకర్ ముదిరాజ్, బిజెపి సీనియర్ నాయకులు యేల్లు రాంరెడ్డి, నలగామ శ్రీనివాస్, ఎరుపుల వెంకటరమణ, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సింగం సత్తయ్య, మాజీ సర్పంచ్ నత్తి మల్లేశం, బిజెపి గజ్వేల్ అసెంబ్లీ కన్వీనర్ సాయిబాబా, గజ్వేల్ పట్టణ మండల అధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్, పంజాల అశోక్ గౌడ్, మండలాల అధ్యక్షులు లక్ష్మణ్ గౌడ్, సంపత్ రెడ్డి, తిరుపతిరెడ్డి, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పార్కు స్థలాల రక్షణకు బీజేపీ రిలే నిరాహార దీక్ష

- కబ్జాదారులను ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్-బీఆర్ఎస్ -శ్రీరాములు




**బడంగ్పేట్,జులై 16 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పార్కుల కోసం కేటాయించిన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నందున,వాటిని పరిరక్షించాలన్న డిమాండ్‌తో బీజేపీ నేతలు రిలే నిరాహార దీక్ష చేపట్టారు.కార్పొరేషన్ కార్యాలయం ఎదుట బీజేపీ అధ్యక్షులు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి,రామిడి వీరకర్ణ రెడ్డి ఆధ్వర్యంలో దీక్ష ప్రారంభమైంది.ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు,నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ అందెల శ్రీరాములు,మాజీ జిల్లా అధ్యక్షుడు బొక్క నరసింహారెడ్డి పాల్గొని సంఘీభావం తెలిపారు.పార్కు స్థలాలను మాయంచేస్తూ కాంగ్రెస్,బీఆర్ఎస్ నేతలు చేతులు కలిపారని ఆరోపించారు.వందల గజాల భూములు కబ్జాలో పడిపోయిన విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోలేదని విమర్శించారు.కబ్జాదారులపై చర్యలు తీసుకుని భూములు తిరిగి కార్పొరేషన్ ఆధీనంలోకి తీసుకోకపోతే ఉద్యమాన్ని ముమ్మరం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పాపయ్య గౌడ్,కొలన్ శంకర్ రెడ్డి,మిద్దె సుదర్శన్ రెడ్డి,దేవేందర్ రెడ్డి,తర్రే మల్లేష్ యాదవ్,చెరుకుపల్లి వెంకట్ రెడ్డి,నడి కుడ యాదగిరి,ఏనుగు ప్రభాకర్ రెడ్డి, మద్ది రాజశేఖర్ రెడ్డి,తోట శ్రీధర్ రెడ్డి,దడిగ శంకర్,నిమ్మల సునీత,శ్రీకాంత్ గౌడ్,గడ్డం లక్ష్మారెడ్డి,ఏనుగు రామిరెడ్డి,పేతుల పుల్లారెడ్డి,నవారు శ్రీనివాస్ రెడ్డి,పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,రేసు నరసింహారెడ్డి,పాలు బాయ్ లక్ష్మణ్,నిమ్మల రవికాంత్ గౌడ్, శశివర్ధన్ రెడ్డి, సైదులు,రాంబాబు గౌడ్,లాలా సందీప్,రవి గౌడ్,కుంటి భాస్కర్,మంత్రి మహేష్,సాయి సంతోష్,కొండల్ యాదవ్ తదితర బీజేపీ, బీజేవైఎం నేతలు పాల్గొన్నారు.

# మాలలకు రోస్టర్ విధానంతో తీవ్ర అన్యాయం

- మాల మహానాడు



**నాగర్‌కర్నూలు, జూలై 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అమ్రాబాద్ మండల కేంద్రంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి. చెన్నయ్య మీడియా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు తో కలిసి మాట్లాడిన చెన్నయ్య, ఎస్సీ వర్గీకరణ మరియు రోస్టర్ విధానం మాలలకు తీవ్ర అన్యాయం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా ఎస్సీలను మూడు గ్రూపులుగా విభజించి, గ్రూప్–3లో ఉన్న మాలలకు కేవలం 5% రిజర్వేషన్ కేటాయించడం వల్ల విద్యా, ఉద్యోగ అవకాశాలు దక్కడం లేదని పేర్కొన్నారు. ఇచ్చిన రిజర్వేషన్ కూడా మాలలకు చేరకుండా, ఇతర గ్రూపులకు కేటాయించబడుతోందని విమర్శించారు. శాతవాహన యూనివర్సిటీ నోటిఫికేషన్‌లో ఎస్సీలకు 6 ఉద్యోగాలు కేటాయించినప్పటికీ, మాలలకు ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకపోవడం రోస్టర్ లోపాలను స్పష్టంగా చూపుతోందని చెన్నయ్య అన్నారు. ఈ విధానాన్ని తక్షణమే సవరించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 28న అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేసి సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లనున్నట్టు తెలిపారు. సమావేశంలో కుంద మల్లికార్జున్, కే. నాసరయ్య, బాలస్వామి, బాలకిష్టయ్య, జక్క గోపాల్, రాజేష్, శ్రీనివాస్, శ్రీకాంత్, కుమార్, నంద, రాముడు, రామాంజనేయులు, పాండ్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఎలిగేడులో ఎమ్మెల్యే విజయ రమణారావు పర్యటన

❑ శివపల్లిలోని నివాసంలో సమస్యలపై విన్నవింపుకు అవకాశం



**ఎలిగేడు, జూలై 16(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెద్దపెల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు నేడు ప్రజలకు అందుబాటులో ఉంటారని ఆయన క్యాంపు కార్యాలయం తెలిపింది. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ఎలిగేడు మండలం శివపల్లి గ్రామంలోని తన నివాసంలో ప్రజలు, కార్యకర్తలు, స్థానిక నాయకులు కలిసి తమ సమస్యలను వివరించవచ్చని చెప్పారు. పరిపాలనలో ప్రజలతో నేరుగా మమేకమయ్యేలా ఎమ్మెల్యే ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ప్రజలు తమ సమస్యలు నిర్భయంగా చెప్పాలని, వీలైన మేరకు పరిష్కారం పొందేందుకు ఇది మంచి అవకాశం అని ఆయన తరఫు కార్యాలయం పేర్కొంది.

# ఎల్లమ్మ చెరువులో ఆయిల్ బాల్స్‌తో దోమల బెడదకు చెక్

❑ 124 ఆల్విన్ కాలనీ డివిజన్‌లో కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ చర్యలు



**ఆల్విన్ కాలనీ, జూలై 16(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
124 ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ చెరువు పరిసర ప్రాంతాల్లో దోమల సమస్య తీవ్రంగా ఉందని స్థానిక ప్రజలు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకురాగా, ఆయన వెంటనే స్పందించారు. ఎంటమాలజీ సిబ్బందితో కలిసి ఎంఎల్వో ఆయిల్ బాల్స్ ను చెరువులో వేసి దోమల నివారణ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, "అయిల్ బాల్స్ వలన దోమలు లార్వా దశలోనే నశిస్తాయి. వ్యాప్తి జరగకుండా నియంత్రించవచ్చు. ప్రతి ఇంటి వద్ద నీటి నిల్వలు తొలగించాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి" అని సూచించారు. వారానికి ఒకసారి తనిఖీ చేసి, దోమలు విపత్తుగా మారే అవకాశాన్ని అడ్డుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తడి చెత్త -పొడి చెత్త వేరు చేసి, చెత్త సేకరించే ఆటోలలోనే వేయాలని సూచించారు. వీధుల్లో, కాలువల్లో చెత్త వేయవద్దన్నారు. ప్రగతి నగర్ నుండి వస్తున్న డ్రైనేజీ నీరు ఎల్లమ్మ చెరువులో కలవకుండా పైప్‌లైన్ ద్వారా దారి మళ్లించే పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. పైప్‌లైన్ పూర్తయిన అనంతరం చెరువులో నీరు శుభ్రంగా ఉండి దోమల సమస్య తీరుతుందని అన్నారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, పోశెట్టిగౌడ్, ఎంటమాలజీ సూపర్వైజర్ డి. నరసింహులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# షిరిడి హిల్స్ పార్కులో హరితహారం

-మొక్కల నాటే కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ విజయలక్ష్మి



**గాజులరామారం, జూలై 16(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారం మహాదేవపురం పరిధిలో ఉన్న షిరిడి హిల్స్ పార్కులో బుధవారం హరితహారం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో GHMC మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మహిళా కాంగ్రెస్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ గంగుల అంజలి యాదవ్, 125 డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి, డీసీ మల్లారెడ్డి పాల్గొన్నారు. పలు కాలనీల అధ్యక్షులు, నాయకులు, కాలనీవాసులు కూడా పెద్ద సంఖ్యలో హాజరై మొక్కల నాటే కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. హరితహారం ద్వారా నగరంలో హరితవాతావరణం పెంపొందుతుందని నేతలు అభిప్రాయపడ్డారు.

# ఘనంగా ఆషాడం బోనాలు..

**మందమర్రి జూలై 16(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మందమర్రి పట్టణంలోని విద్యానగర్ మేకల మండి దారి మైసమ్మ ఆషాడం మాసం బోనాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆటపాటలతో బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు సొతుకు సుదర్శన్, ఉపేందర్ గౌడ్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఆషాడం బోనాలు అనేది తెలంగాణ సాంప్రదాయమని అందరూ బాగుండాలి అన్న కోరికతో అమ్మవారికి బోనం సమర్పించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. అమ్మ దయవల్ల అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మెంబర్స్,అంటేల కనకయ్య,గాదే రాములు, టైలర్ సత్తయ్య,మంగలి రాజయ్య,బూత్కూరి శంకర్,బోయిన్ శంకర్, చిన్న మొగిలి మల్లేష్,గాదే రవి, వెల్డింగ్ షాప్ లింగన్న,టేల కృష్ణ,చిన్న మొగిలి గణేష్,బోయిని ప్రేమ్ సాగర్,స్థానిక నాయకులు మరియు విద్యానగర్ వాసులు తదితరులు, పాల్గొన్నారు.

# మహేశ్వరం మండల బిజెపి సన్నాహక సమావేశం

❑ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించిన అందెల శ్రీరాములు



**మహేశ్వరం జులై 16 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల్ బిజెపి అధ్యక్షుడు యదీష్ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా నిర్వహించినటువంటి సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథులుగా నూతనంగా ఎన్నికైనటువంటి రంగారెడ్డి రూరల్ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల బిజెపి కన్వీనర్,మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంచార్జ్ అందెల శ్రీరాములు హాజరై స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మండల మాజీ ప్రజా ప్రతినిధులకు,మండల నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి రూరల్ జిల్లా మాజీ అధ్యక్షులు బొక్క నరసింహారెడ్డి,జాతీయ కిసాన్ మోర్చా సభ్యులు పాపయ్య గౌడ్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కడారి జంగయ్య యాదవ్,చేవెళ్ల పార్లమెంట్ కో కన్వీనర్ అనంతయ్య గౌడ్,జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్ రెడ్డి,అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి,మాజీ మండల అధ్యక్షులు మాధవచారి,మాజీ ఎంపీపీ కుండే వెంకటేష్,మాజీ ప్రజా ప్రతినిధులు, బిజెపి మరియు బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన ఈగ మల్లేశం



**వర్ధన్నపేట, జులై 16(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఐనవోలు మండలం సింగారం గ్రామానికి చెందిన వరంగల్ జిల్లా డిసిసిబి బ్యాంక్ మాజీ చైర్మన్ కీ.శే. దోపతి దామోదర్ రెడ్డి తల్లి సూరమ్మ అనారోగ్యం తో మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఈగ మల్లేశం మాట్లాడుతూ వారి కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మాజీ సర్పంచ్ అనిమిరెడ్డి మధుసూదన్ రెడ్డి, డి సి సి బి బ్యాంక్ డైరెక్టర్ జైపాల్ రెడ్డి, శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థాన మాజీ చైర్మన్ సిలువేరు కుమార స్వామి, పి ఏ సి ఎస్ మాజీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఉప్పరపల్లి నీటి తీర్వ సంఘం మాజీ చైర్మన్ కరిమిళ్ల సంపత్ రావు, డాక రెడ్డి, తిలక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూసమస్యలను పరిష్కరించడంలో వేగం పెంచాలి

❑ జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి,జూలై 16( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
భూ భారతి చట్టం ప్రకారం రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించడంలో వేగం పెంచాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి తహసీల్దార్లను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ సమావేశ మందిరంలో తహశీల్దార్ల, డిటీ లు, ఆర్ ఐ, ఆపరేటర్లతో రెవెన్యూ దరఖాస్తుల పరిష్కారం పై సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా ఎన్ని దరఖాస్తులు పరిష్కారమయ్యాయి ఇంకా ఎన్ని పెండింగ్లో ఉన్నాయనే విషయాన్ని పరిశీలించి సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి చట్టం ప్రకారం రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించడంలో వేగం పెంచాలని ఆదేశించారు. ఈ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. ఆగస్టు 15 నాటికి ఏ ఒక్క దరఖాస్తు పెండింగ్ లేకుండా చూసుకోవాలని ప్రభుత్వం నుండి ఆదేశాలు ఉన్నట్లు తెలిపారు. అందువల్ల వచ్చిన దరఖాస్తులను ఆన్లైన్ లో నమోదు చేసుకొని అవసరమైన వారికి వెంటనే నోటీసులు పంపించాలని సూచించారు. ప్రజలు దరఖాస్తు చేసిన సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలని, నూతన భూభారతి చట్టం మేరకు సమస్యలు తక్షణమే పరిష్కరించాల్సిందిగా సూచించారు. చాలా దరఖాస్తులు తహసిల్దార్ లాగిన్ లోనే పరిష్కరించవచ్చని వాటిని త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఆర్డీఓ లాగిన్ కు పంపించాల్సింది ఆర్డీఓ కు మిగిలినవి కలెక్టర్ లాగిన్ కు పంపించాలని ఆదేశించారు అన్ని దరఖాస్తులకు తప్పకుండా రికార్డులు పెట్టాలని, ఒకవేళ ఏదైనా దరఖాస్తును తిరస్కరించాల్సి ఉంటే స్పీకింగ్ ఆర్డర్ ద్వారా తిరస్కరించి దరఖాస్తు దారుకు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తులను పరిష్కరించే ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. ఈ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. సమావేశంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తాసిల్దార్లు, డిటీ లు, ఆర్ ఐ, ఆపరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్ విస్తరణ బాధితులకు న్యాయం జరగాలి

❑ కార్పొరేటర్ ఆకుల.శ్రీవాణి



**సరూర్ నగర్ జులై 16 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం సరూర్ నగర్ లో.. సరూర్నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి మాట్లాడుతూ. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా చేపట్టిన 100 అడుగుల రోడ్ విస్తరణలో ఇళ్లు కోల్పోయిన బాధితులను సరూర్ నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి స్వయంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ:- బాధితులకు తగిన న్యాయం జరగాలని, టి డి ఆర్ (ట్రాన్స్‌ఫరల్ డెవలప్మెంట్ రైట్స్) కు బదులుగా ప్రభుత్వం నిర్ణయించిన విలువకు మూడు రెట్లు నగదు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. అలాగే,పూర్తిగా స్థలం కోల్పోయిన వారికి వేరే ప్రాంతంలో స్థలం కేటాయించాలనే డిమాండ్‌ను ప్రభుత్వానికి సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అండగా ఉంటానని,న్యాయం జరిగే వరకు బాధితుల వెంబడి నిలుస్తానని ఆకుల శ్రీవాణి ధైర్యం చెప్పారు.

# కరీంనగర్‌లో ఆర్యవైశ్య వధూవరుల పరిచయ వేదిక

**కరీంనగర్, జూలై 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో జూలై 20 ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు కరీంనగర్ గాంధీ రోడ్‌లోని వైశ్య భవన్‌లో వధూవరుల పరిచయ వేదిక, పునర్వివాహ పరిచయ వేదిక నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య వధూవరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా మహాసభ అధ్యక్షులు కన్న కృష్ణ, ప్రధాన కార్యదర్శి కొమురవెల్లి వెంకటేశం, కోశాధికారి పడకంటి శ్రీనివాస్, వధూవరుల పరిచయ వేదిక చైర్మన్ తోడుపునూరి తిరుపతి కోరారు.

# "డబ్బులు ఇవ్వకపోతే పోలీస్ కమిషనర్ వద్దకు వెళ్తాను"

❑ జూబ్లీహిల్స్‌లో ఓర్సు ముత్యాల ఆవేదన



**జూబ్లీహిల్స్, జూలై 16(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడి సమీపంలోని ఫినిక్స్ కంపెనీలో పనిచేసిన ఓర్సు ముత్యాలు, తనకు రావాల్సిన జీతం, ఖర్చుల విషయమై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మెతుకుపల్లి సందీప్ రెడ్డి ఆధ్వర్యంలో పలు కంపెనీలలో 15 లక్షల రూపాయల వరకు పని చేసినా, ఇప్పటివరకు తనకు పూర్తి డబ్బులు ఇవ్వలేదని ముత్యాలు ఆరోపించారు. ఫిబ్రవరి 10, 2025న ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ, సందీప్ రెడ్డి "ఇస్తానంటూ" మాటలు ఇచ్చి కాలం గడుపుతున్నారని తెలిపారు. కంప్రెసర్ నడిపే సమయంలో ఓ కార్మికుడు తీవ్రంగా గాయపడగా, రెండు లక్షల రూపాయలు ఖర్చు ముత్యాలే భరించారని చెప్పారు. ఆ మొత్తాన్ని కూడా తిరిగి ఇవ్వలేదని వాపోయారు. తనకు ఇచ్చిన లక్ష రూపాయల చెక్కు 2021 ఫిబ్రవరి 15న బౌన్స్ అయినట్లు పేర్కొన్నారు. ఫోన్ చేస్తే "నువ్వు ఏం చేసుకుంటావో చేసుకో, ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో" అంటూ బెదిరింపులు వస్తున్నాయని, "నీ అంతు చూస్తా" అంటూ సందీప్ రెడ్డి హెచ్చరిస్తున్నారని ఆరోపించారు. ఫైనాన్స్ ఒత్తిడితో ఆత్మహత్యకు కూడా ప్రయత్నించాల్సి వచ్చిందని ముత్యాలు ఆవేదన వ్యక్తం చేశారు. "ఇకపై డబ్బులు ఇవ్వకపోతే పోలీస్ కమిషనర్ వద్దకు వెళ్తాను" అంటూ ఆయన హెచ్చరించారు.



❑ తూప్రాన్ హాస్టల్లో పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ఐదో తరగతి అమ్మాయి ఫైల్ ఫోటో

# మళ్లీ సారే కావాలంటున్నారు..

- మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి శంకర్ పల్లిలో బీఆర్ఎస్ శ్రేణులకు సబితా ఉత్సాహం
- మళ్లీ కేసీఆర్ పాలనకే ప్రజల మద్దతు



**శంకర్ పల్లి జులై 16 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం శంకర్ పల్లి మండల మరియు మునిసిపల్ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి,మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ:-మళ్లీ తెలంగాణలో కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడు వచ్చినా సమర్థంగా ఎదుర్కొనేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని సూచించారు. త్వరలోనే ప్రతి మండలంలో పార్టీ కార్యాలయాలు ప్రారంభించాలని,ప్రతిపక్షంలో ఉండగలిగితేనే నిజమైన నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని వ్యాఖ్యానించారు. గతంలో వైఎస్సార్ హయాంలో,కేసీఆర్ పదేళ్ల పాలనలో వర్షాలు సమృద్ధిగా కురవగా,నేడు ప్రకృతి సహకరించడం లేదని పేర్కొన్నారు. రైతుల సంక్షేమాన్ని పక్కనపెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రేణులను మోసం చేస్తోందని విమర్శించారు. రైతు భరోసా పథకం కేవలం ఎన్నికల ముందు ఒకసారి ఇచ్చి సంబరాలు చేసుకోవడం విడ్డూరమని,కేసీఆర్ హయాంలో 11 సార్లు ఇచ్చినప్పుడు ఎన్ని సార్లు సంబరాలు చేసుకున్నామో అడిగారు. రైతు మరణాలపై గతంలో ఇచ్చే రూ. 5 లక్షల బీమాను నేడు నిలిపివేయడాన్ని తప్పుపట్టారు. మహిళలకు ఎన్నికల ముందు హామీగా ఇచ్చిన తులం బంగారం,విద్యార్థినీలకు స్కూటీలు ఇప్పటికీ నెరవేరలేదని విమర్శించారు. ఎన్నికల దృష్ట్యా ప్రస్తుతం రేషన్ కార్డుల పంపిణీని పెద్ద ఎత్తున ప్రచారం చేయడంహాస్యాస్పదమన్నారు. గతంలో మిషన్ భగీరథ ద్వారా పరిష్కరించిన నీటి సమస్యలు మళ్లీపునరావృతమవుతున్నాయని, మహిళలు ఖాళీ బిందెలతో తిరుగుతున్న దృశ్యాలు తాము మళ్లీ చూస్తున్నామని విచారం వ్యక్తం చేశారు. అధికారులు ప్రజల పక్షంగా పనిచేయాలని, అధికార పార్టీకి అనుకూలంగా కాకుండా నిజాయితీగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ కార్యకర్తలు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండాలని,మండల సమన్వయ కమిటీలు ఏర్పాటు చేసి గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శంకర్ పల్లి మాజీ ఎంపీపీ గోవర్ధన్ రెడ్డి,మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తుక్కుగూడలో మహిళా కాంగ్రెస్ మీటింగ్ ఘనంగా



**తుక్కుగూడ, జూలై 16(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తుక్కుగూడలోని లక్ష్మారెడ్డి పార్టీ కార్యాలయంలో మహేశ్వరం నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కందుల సమత ప్రకాష్ ఆధ్వర్యంలో మహిళా కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ మీటింగ్‌ను నిర్వహించారు. జిల్లా మహిళా అధ్యక్షురాలు జ్యోతి బీమ్ భారతి ఆదేశాల మేరకు ఈ సమావేశం ఏర్పాటయ్యింది. ఈ కార్యక్రమంలో సమత ప్రకాష్ మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలు కాంగ్రెస్ బలోపేతానికి చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. మహిళా విభాగ కమిటీలకు పార్టీ విధానాలను వివరించడంతో పాటు ఆషాఢం గోరింటాకు వేడుకలను కూడా జరిపారు. గత 18 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రజల మద్దతు పెరుగుతోందని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళల కోసం ఉచిత ఆర్టీసీ ప్రయాణం, పేదలకు సొంతింటి కలను నెరవేర్చడం, ఉచిత విద్యుత్, అతి తక్కువ ధరలో గ్యాస్, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, తెలంగాణలోనే మొదటిసారిగా సన్న బియ్యం పంపిణీ వంటి ప్రయోజనాలు అందిస్తున్నట్టుగా వివరించారు. ఈ కార్యక్రమానికి మాజీ జిల్లా చైర్మన్ అనిత రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి లక్ష్మమ్మ, వైస్ ప్రెసిడెంట్ కమలమ్మ, బ్లాక్ అధ్యక్షురాలు పద్మారెడ్డి, జనరల్ సెక్రటరీ సుగుణ రెడ్డి, బడంగ్‌పేట్ మున్సిపల్ ప్రెసిడెంట్ అమృత నాయుడు, జల్పల్లి మున్సిపల్ ప్రెసిడెంట్ నజీమ్ సుల్తాన్, కందుకూర్ మండల్ ప్రెసిడెంట్ కవిత, మీర్పేట్ మున్సిపల్ ప్రెసిడెంట్ పద్మశ్రీ, భారతమ్మ, ప్రభావతి, సరూర్నగర్ ప్రెసిడెంట్ అరుణ తదితరులు హాజరయ్యారు.

## స్థానిక ఎన్నికల్లో సీపీఐ చెలరేగాలి

- పంజాల శ్రీనివాస్



**చిగురుమామిడి, జూలై 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థులు అధిక స్థానాలు గెలిచేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలని జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. చిగురుమామిడి మండలంలోని ఎంపీటీసీ స్థానాల వారిగా నిర్వహించిన సీపీఐ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ, పేదల సంక్షేమం కోసం ప్రజాప్రతినిధులుగా పార్టీ గెలవాల్సిన అవసరం ఉందని అన్నారు. గత ప్రభుత్వాలు అర్హులకు కాకుండా తమవాళ్లకే పథకాలు అందించాయని విమర్శించారు. ఇందుర్తి, చిగురుమామిడి, సుందరగిరి, లంబాడిపల్లి, సీతారాంపూర్ సమావేశాల్లో జిల్లా, మండల, గ్రామ శాఖల నాయకులు, రైతు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాలాల్లో పాల్గొన్న మాజీ సర్పంచ్ రాజిరెడ్డి

**దోమ మండల జూలై 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
దోమ మండల కేంద్రంలో బుధవారం పోచమ్మ బోనాలు ఘనంగా జరిగాయి గ్రామ మహిళా మణులు భక్తి శ్రద్ధలతో బోనాల ఊరేగింపు ప్రసాదాల వడ్డీంపు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ కె. రాజిరెడ్డి పాల్గొని అమ్మ వారికీ మొక్కులు చెల్లించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పురోహితుడు జోషి శేషాద్రి రావు, మాజి వార్డ్ సభ్యుడు బండి సాయిలు, యువకులు శ్రవణ్ కుమార్ రెడ్డి, ఈరారపు నారాయణ, శేఖర్, హరీష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## “ఇంగ్లీష్ క్లబ్” ఆదర్శనీయం: కలెక్టర్ పమేలా



**జమ్మికుంట, జూలై 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
చల్లూరు జడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటైన ఇంగ్లీష్ క్లబ్ విద్యార్థుల నైపుణ్యాల అభివృద్ధికి ఆదర్శంగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. “బుధవారం బోధన” కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఇంగ్లీష్ క్లబ్‌లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్, విద్యా వార్తా ఛానల్ ప్రారంభంపై ప్రశంసలు అందించిన కలెక్టర్, బీపీ, షుగర్, థైరాయిడ్ మందులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందుబాటులో ఉంటాయంటూ అవగాహన కల్పించాలని సూచించారు.

**ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన:**
మామిడాలపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని పరిశీలించిన కలెక్టర్, లబ్ధిదారుల సమస్యలు తెలుసుకుని నిర్మాణం పూర్తి చేస్తే ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యా శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మోత్కూర్ లో ఘనంగా బోనమ్మ బోనాలు.

**దోమ మండలం జూలై 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పరిగి నియోజకవర్గం దోమ మండల పరిధిలోని మోత్కూర్ గ్రామంలో బోనమ్మ బోనాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో కెఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్ కుమార్ రెడ్డి పాల్గొని అమ్మవారికి మొక్కి ప్రజలను ఎల్లవేళలా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అన్నారు. వర్షాకాలంలో వర్షాలు బాగా కురిసి పంటలు సంసిద్ధంగా పండాలని బోనాల కార్యక్రమాన్ని నిర్వహిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో కెఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ, యువకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల నియామకానికి డీఈవోను కలిసిన అజిలాపూర్ గ్రామస్తులు




**వెల్దండ, జూలై 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల పరిధిలోని అజిలాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం నాగర్‌కర్నూల్‌లో జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్‌ను కలిసి ఉపాధ్యాయుల నియామకానికి వినతిపత్రం అందజేశారు. ఈ పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి 8వ తరగతిని ప్రారంభించినప్పటికీ, తెలుగు, ఇంగ్లీష్, సైన్స్, హిందీ సబ్జెక్టులకు ఉపాధ్యాయులు లేకపోవడం వల్ల విద్యార్థులకు బోధనలో తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని గ్రామస్తులు తెలిపారు. వెంటనే నలుగురు ఉపాధ్యాయులను నియమించాలని వారు డీఈవోను కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కేశమౌని పద్మ, గ్రామస్తులు సిద్ధగోని రమేష్ గౌడ్, కేశమౌని కృష్ణయ్య గౌడ్, కొప్పు కృష్ణయ్య, కుర్వూర్ కుమార్, కొప్పుల రామస్వామి, కొప్పుల యాదయ్య, వెంకటయ్య జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమ భవనానికి విరాళం



**కరీంనగర్, జూలై 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కొత్తపల్లి మండలం మల్కాపూర్ గ్రామంలో జైకిసాన్ రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్మాణంలో ఉన్న రైతు సంక్షేమ భవనానికి బుధవారం నరహరి లక్ష్మారెడ్డి రూ. 25,000 విరాళంగా అందజేశారు. ఈ విరాళం ఆయన తండ్రి కీర్తిశేషులు నరహరి రామ్ రెడ్డి జ్ఞాపకార్థంగా ఇచ్చారు. నరహరి లక్ష్మారెడ్డి విశ్రాంత ఉపాధ్యాయులు మరియు రాజరాజేశ్వరి లైన్స్ క్లబ్ అధ్యక్షులుగా సేవలందిస్తున్నారు. విరాళాన్ని జైకిసాన్ రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుంటపల్లి రవికి అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి కొత్త మహేష్, కోశాధికారి గంగాధర నరేష్, గౌరవ అధ్యక్షులు గంగాధర లక్ష్మణ్, మాజీ ఉపసర్పంచ్ కాంతాల జగన్ రెడ్డి, సభ్యులు కొత్త కనకయ్య, కొత్త లింగమూర్తి, కొత్త మధు, పల్లాటి ప్రశాంత్, బొలబత్తిని శ్రీనివాస్, పల్లాటి జలంధర్, కుమ్మరి రామస్వామి, పండుగ కృష్ణ కుమార్, జాడి రాజు తదితరులు పాల్గొన్నారు.

## మల్యాల ప్రతాప్‌కు ఘన సన్మానం



**కరీంనగర్, జూలై 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన మల్యాల ప్రతాప్‌కు డిసిసి లీగల్ సెల్ ఆధ్వర్యంలో ఘన సన్మానం జరిగింది. న్యాయవాదుల సమావేశం హాల్లో శాలువ కప్పి సత్కరించి స్వీట్ల పంపిణీ చేశారు. తన నియామకానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, లక్ష్మణ్ కుమార్, చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్‌లకు మల్యాల ప్రతాప్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా లీగల్ సెల్ సభ్యులు ఆర్. దేవేందర్ రెడ్డి, భుక్య రజనీష్, కొత్త ప్రకాశ్, సయ్యద్ చాంద్, సీనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## సాగునీటి సమస్యపై వినూత్న నిరసన



**చొప్పదండి, జూలై 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కొత్తపల్లి ఎస్సారెస్పీ కాలువలో నీరు లేక ఎండిపోవడంతో, బీఆర్ఎస్ నేతలు క్రికెట్ ఆడి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆధ్వర్యంలో ఈ వినూత్న నిరసన చేపట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గతంలో ఎత్తిపోతల పథకం ద్వారా దిగువ జలాలను ఎగువకు మళ్లించి, ఎస్సారెస్పీ వరద కాలువ ద్వారా పలు జిల్లాలకు సాగునీరు అందించారని గుర్తు చేశారు. ప్రస్తుతం నీటిని విడుదల చేసే అవకాశం ఉన్నా పంపులను ఆన్ చేయకుండా వృథాగా దిగువకు వదిలేస్తున్నారని మండిపడ్డారు. సాగు, త్రాగునీటి కోసం రైతులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. నాలుగు రోజుల్లోగా నీటిని విడుదల చేయకపోతే రైతులతో కలిసి భారీ ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసిలు, సర్పంచులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పునర్నిర్మాణంపై నేతల సూచనలు




**కరీంనగర్, జూలై 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కాంగ్రెస్ పార్టీ పునర్నిర్మాణ సమావేశంలో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ, జిల్లాలో నియామకాలు కులాల వారీగా, నిబద్ధతతో పనిచేసిన వారికి ఇవ్వాలని సూచించారు. ప్రతీ అసెంబ్లీకి ఉపాధ్యక్షుడు, బ్లాక్‌కు ప్రధాన కార్యదర్శి, మండలానికి కార్యదర్శిని నియమించాలని అన్నారు. పార్టీ విజయంలో కార్యకర్తల కృషి కీలకమన్నారు. రాహుల్ గాంధీ చెప్పినట్లుగా, కార్యకర్తలే నాయకులవ్వాలని చెప్పారు. తెలంగాణ మోడల్‌గా దేశంలో మెంబర్షిప్‌లో ముందంజలో ఉందని గుర్తు చేశారు.కేసీఆర్‌పై విమర్శలు చేస్తూ, "కింద ప్రాజెక్టు కట్టి పైకి నీరు పారిస్తానన్న దిమాక్" అంటూ ఎద్దేవా చేశారు. "తెలంగాణను ముంచిన కెసిఆర్‌ను పాతాళంలోకి తొక్కినది కాంగ్రెస్ కార్యకర్తలే" అన్నారు.సభలో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, నాయిని రాజేందర్ రెడ్డి, ఆది శ్రీనివాస్, కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పాపమే సర్పంచులకు ఈ దుస్థితి": మేడిపల్లి సత్యం



**కరీంనగర్, జూలై 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** లక్ష్మీదేవిపల్లి మాజీ సర్పంచ్ భర్త రవి ఆత్మహత్యాయత్నంపై స్పందించిన మాజీ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, "గ్రామాభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం సర్పంచులను అధోగతికి దారి తీసింది" అని విమర్శించారు. కేసీఆర్ పాలనలో పెండింగ్ బిల్లుల బాధతో అనేక మంది సర్పంచులు ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలిపారు."తాళ్ల విజయలక్ష్మి అప్పులపై అభివృద్ధి పనులు చేపట్టి, బిల్లులు రాక కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. బాధిత కుటుంబానికి మెరుగైన చికిత్స, అవసరమైన అండను అందిస్తాం" అని చెప్పారు.సర్పంచులు ఆందోళన చెందవద్దని, పెండింగ్ బిల్లుల చెల్లింపుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు ముత్యం శంకర్, జాగిరపు రజిత శ్రీనివాస్ రెడ్డి, ఇప్ప శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

# 'ఆరోగ్య మహిళ" పరీక్షలు వేగవంతం చేయాలి

▫ కలెక్టర్ పమేలా



**జమ్మికుంట, జూలై 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జమ్మికుంట ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిని సందర్శించిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, "ఆరోగ్య మహిళ" వైద్య పరీక్షలు వేగవంతం చేయాలని సూచించారు. ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్లు పూర్తిచేయాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని అధికారులకు ఆదేశించారు.ఆసుపత్రి వార్డులు, ల్యాబ్, మెడికల్ స్టోర్స్, లేబర్ రూమ్ పరిశీలించిన ఆమె, రోగులతో మాట్లాడి సేవలపై వివరాలు తెలుసుకున్నారు. కాన్ఫరెన్స్ హాల్లో వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు.ప్రతి నెలా ఓపి, ఐపి, ఆరోగ్య మహిళ, డెలివరీల నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. బీపీ, షుగర్ మందులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందుబాటులో ఉన్నాయని, ప్రజల్లో అవగాహన కల్పించాలని చెప్పారు. 13 ఏళు నిండిన మహిళలకు అన్ని రకాల పరీక్షలు చేసి అవసరమైన మందులు అందించాలని తెలిపారు.ఆసుపత్రిలో సేవల వివరాలు బోర్డుల ద్వారా స్పష్టంగా చూపించాలని, టీబి పరీక్షలు పెంచాలని, క్యాల్షియం, ఐరన్, విటమిన్ మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు. అత్యవసర సదుపాయాలు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని, ప్రైవేట్ అంబులెన్సులు ఆసుపత్రికి దూరంగా నిలపాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమేష్ బాబు, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, శ్రీకాంత్ రెడ్డి, సనా తదితరులు పాల్గొన్నారు.

# ఆశల్ని నలిపేస్తున్న ఆధునిక విద్యా విధానం!

▫ ఒత్తిడి భరించలేక ప్రాణాలు పోగొట్టుకుంటున్న చిన్నారులు



ప్రాథమిక విద్యా స్థాయిలో చదువుతున్న పసికందులు ఆత్మహత్యలు చేసుకుంటున్న ఘటనలు మన సమాజాన్ని కలచివేస్తున్నాయి. అభివృద్ధి పేరిట పిల్లల పై వేస్తున్న ఒత్తిడి -భరించలేక చిరునవ్వుల్ని కోల్పోతున్న చిన్న మనసులు మనల్ని ఆలోచనలో పడేస్తున్నాయి.

-విద్య అంటే ఆనందం కలిగించే మాధ్యమం కావాలి. కానీ ఇప్పటి పరిస్థితుల్లో అది ఓ భయానక కలగా మారుతోంది. పోటీలో ముందుండాలనే పేరుతో చిన్నారుల్ని హాస్టళ్లలో -బందిలా ఉంచుతూ, మానసికంగా ఉక్కిరిబిక్కిరి చేస్తున్న పరిస్థితి ఎంత మర్మాన్ని కలిచేసిందో ఈ ఘటనలు చెప్పకనే చెబుతున్నాయి.

### ▫ హాస్టల్ జీవితం ..ప్రేమకు దూరం

తల్లిదండ్రుల ఆశలు.. టీచర్ల టార్గెట్లు.. స్కూళ్ల మార్కుల మానియా ఇవన్నీ కలసి చిన్నారి జీవితం మీద మానసికంగా ముద్ర వేసే ప్రయత్నాలు చేస్తున్నాయి. కుటుంబం నుంచి దూరంగా ఉండే హాస్టల్ వాతావరణం బాల్యంలోనే ఒత్తిడితో నిండిన జీవితాన్ని తీసుకొస్తోంది. ఆ హృదయాలు ప్రేమను కోరుతున్నాయి. కానీ భయాన్ని అందుకుంటున్నాయి. ఇలాంటి దుస్థితి సమాజంగా మనల్ని ప్రశ్నించకపోతే ఎవరు ప్రశ్నిస్తారు?

### ▫ ప్రత్యామ్నాయ దారులు - పాఠశాలలే ఆశ్రయం కావాలి

విద్యను మరింత హేతుబద్ధంగా, మానవీయంగా అందించాల్సిన అవసరం తీవ్రంగా కనిపిస్తోంది. ప్రతి చిన్నారికి ప్రేమతో, అర్థమయ్యే భాషలో, స్నేహపూర్వక వాతావరణంలో బోధన జరగాలి. అందుకోసమే కొన్ని కీలక మార్గదర్శకాలు అవసరం:

- హాస్టల్ ఆధారిత విద్యను తప్పనిసరిగా కాకుండా, తల్లిదండ్రుల ఎంపికపై ఆధారపడి ఉండాలి.
- గ్రామాల్లోనే నాణ్యమైన ప్రభుత్వ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలి.
- పిల్లల మానసిక స్థితిని గమనించి, ఒత్తిడి తక్కువ వాతావరణాన్ని కల్పించాలి.

-"మార్కులు" అనే మాంత్రిక పదం కోసం పిల్లలను అరచేతిలో నలపడం ఆపాలి.

### ▫ విద్య భయం కాదు - ఆశగా ఉండాలి

విద్య అనేది జీవితం మీద భారం కాకూడదు. అది ఆశలకు బీజం వేయాలి. కలలు కంచెతీగల్లా పులకరించాలి. మన చిన్నారులు భవిష్యత్తులో విలువైన పౌరులుగా మారాలంటే.. వారిలో ఆశను నింపాల్సిన బాధ్యత మనదే!

విద్యారంగం ఇప్పుడు మేల్కొనాలి. పాలకులు నిద్రలేచాలి. మన పిల్లల కోసం మనం ఎంచుకునే మార్గం ఓ పసివాడి జీవితం పైన ప్రభావం చూపుతుంది. జీవితం అంటే భయమో, ఆశా -అది మన తీరుపై ఆధారపడి ఉంటుంది!

వ్యాసకర్త
గంగవరం రామకృష్ణారెడ్డి

# పెద్దపల్లిలో ఇందిరా మహిళా శక్తి సంబరాలు

**పెద్దపల్లి, జూలై 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి పట్టణంలో జరిగిన ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, సీతక్క, శ్రీధర్ బాబు పాల్గొన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగి ఆత్మగౌరవంతో జీవించాలన్న సందేశాన్ని మంత్రులు ఇచ్చారు. ఈ సందర్భంగా వడ్డీ లేని రుణాల చెక్కులు, ప్రమాద భీమా, లోన్ భీమా చెక్కులు పంపిణీ చేశారు. మహిళల పేరుపై రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్లు, ఆర్టీసీ అద్దె బస్సులు, పెట్రోల్ బంకులు, రైస్ మిల్లులు ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. పామాయిల్ పంట సాగుకు ఎకరానికి 51,000 సబ్సిడీ, 25,000 ధర కల్పన చేస్తామని తుమ్మల తెలిపారు. పెద్దపల్లిలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం, సిద్దిపేటలో మరో ఫ్యాక్టరీ ప్రారంభం కానుందని చెప్పారు.శ్రీధర్ బాబు మాట్లాడుతూ, మహిళా



సంఘాలకు 26,000 కోట్ల బ్యాంక్ లింకేజ్ రుణాలు అందించామని, వీ-హబ్ కేంద్రం త్వరలో ప్రారంభమవుతుందని తెలిపారు. సీతక్క మాట్లాడుతూ, 60 ఏళ్లు దాటిన మహిళలకు ప్రత్యేక సంఘాలు, దివ్యాంగులకు సంఘాల ఏర్పాటు, ఉచిత చీరల పంపిణీ వంటి పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, జిల్లాలో 16,800 మహిళా సంఘాలకు 15.74 కోట్ల వడ్డీ సబ్సిడీ, 67 మంది సభ్యులకు 87 లక్షల బీమా సహాయం అందించామని తెలిపారు. 2 మెగా వాట్ల సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంక్, వీ-హబ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు జరుగుతుందని చెప్పారు. ఎమ్మెల్యే విజయరమణా రావు మాట్లాడుతూ, 4521 సంఘాలకు 4.94 కోట్ల వడ్డీ లేని రుణాలు, 56.50 కోట్ల బ్యాంక్ లింకేజ్, 11.75 కోట్ల స్త్రీ నిధి పంపిణీ చేశామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన టీఆర్ఎస్ ప్రభుత్వం

**కరీంనగర్, జూలై 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నేతలు నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మాజీ మంత్రి అద్దంకి దయాకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనపై తీవ్ర విమర్శలు చేస్తూ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ హామీల అమలులో నిరంతరం పనిచేస్తుందని పేర్కొన్నారు.ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, "ఒక దశాబ్ద కాలంలో కేవలం 10 రేషన్ కార్డులూ ఇవ్వలేకపోయిన బీఆర్ఎస్ ప్రభుత్వం, కొత్త ప్రభుత్వం మూడు నెలలకే కూలిపోతుందన్నవారు%ా% ఈరోజు ప్రజాపాలనలో 18 గంటలు పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చూస్తూ ఉండాలి" అన్నారు. బీసీలకు 4 శాతం రాజకీయ రిజర్వేషన్ కల్పన, ఎస్సీల వర్గీకరణ అమలుపై కాంగ్రెస్ కట్టుబాటు చూపుతోందని స్పష్టం చేశారు. మాజీ మంత్రి అద్దంకి దయాకర్ మాట్లాడుతూ, "రాహుల్ గాంధీని ప్రధాని చేయాలన్న లక్ష్యంతో పార్టీ పునర్నిర్మాణ కసరత్తు ప్రారంభించింది. బీజేపీపై




దేశవ్యాప్తంగా వ్యతిరేకత పెరుగుతోందని, మోడీ హయాం త్వరలో ముగియబోతుందని సూచించారు." సీఎం రేవంత్ రెడ్డి రాహుల్ గాంధీ ఆలోచనలకు కార్యరూపం దాలుస్తున్నారని పేర్కొన్నారు.బీజేపీ, బీఆర్ఎస్ ప్రజలకు కాకుండా మత, ప్రాంత రాజకీయాలు చేస్తుంటే, కాంగ్రెస్ ప్రజల సమస్యల పరిష్కారంపై కేంద్రీకృతమవుతున్నదని నేతలు తెలిపారు. బీసీ బిల్లుపై బీజేపీ మౌనంగా ఉండటం కేంద్రం కమిట్మెంట్ లేకపోవడం సూచించదన్నారు. కేసీఆర్ పాలనలో 8 లక్షల కోట్ల అప్పులు, కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యం, తెలంగాణ సెంటిమెంట్తో రాజకీయ ప్రయోజనాలు పొందడాన్ని గుర్తు చేశారు.తెరవెనుక 30 వేల ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, కార్యకర్తలకు రాజకీయ పదవులు కల్పించడానికి కాంగ్రెస్ సిద్ధంగా ఉందని నేతలు తెలిపారు. సమావేశంలో పెద్ద సంఖ్యలో నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మానకొండూర్ కాంగ్రెస్లోకి భారీగా చేరికలు



**మానకొండూర్, జూలై 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మానకొండూర్ రాజకీయాల్లో బీఆర్ఎస్‌కు వరుస షాకులు తగులుతున్నాయి. తాజాగా ఇల్లంతకుంట మండలానికి చెందిన పలువురు మాజీ సర్పంచులు, ప్రముఖ నాయకులు బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో మానకొండూర్ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డా. కవ్వంపల్లి సత్యనారాయణ కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రజల ఆశల్ని తీర్చే విధానాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోంది. పార్టీకి పని చేసినవారికి తగిన గౌరవం లభిస్తుంది. అంతర్గత విషయాలను బహిరంగంగా కాకుండా నేరుగా తన దృష్టికి తీసుకురావాలి" అని సూచించారు. కాంగ్రెస్‌లో చేరినవారిలో తిప్పాపూర్, గాలిపెల్లి, జవారిపేట గ్రామాల మాజీ సర్పంచులు, ఉపసర్పంచులు, నాయకులు ఉన్నారు. జిల్లాకు చెందిన ముఖ్యనాయకులు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, పాశం రాజేందర్ రెడ్డి, ఊట్కూరి వెంకటరమణారెడ్డి, జ్యోతి, పసుల వెంకటి, ఆకుల సత్యం తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో రోడ్డు ప్రమాద బాధితుడికి మంత్రి శ్రీధర్ బాబు ఆపన్న హస్తం



**కరీంనగర్, జూలై 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తన మానవతా గుణాన్ని చాటుకున్నారు. కరీంనగర్‌లో అధికారిక కార్యక్రమాల అనంతరం తిరిగి వస్తున్న సమయంలో, కేబుల్ బ్రిడ్జి సమీపంలో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రోడ్డు పక్కన పడి ఉన్న యువకుడిని చూసి చలించిపోయారు.వెంటనే వాహనం ఆపి, బాధితుడికి ధైర్యం చెప్పి స్థానిక పోలీసులను అప్రమత్తం చేశారు. స్వయంగా దగ్గరుండి ఆటోలో నిమ్స్ ఆసుపత్రికి పంపించి, ఓ కానిస్టేబుల్‌ను సాయంగా పంపించారు. వైద్యులతో ఫోన్లో మాట్లాడి మెరుగైన చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు. అనంతరం బాధితుడి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.సకాలంలో స్పందించి, బాధితుడికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్న మంత్రి శ్రీధర్ బాబుకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# సీపీఆర్ పై అవగాహన అవసరం

- కేంద్ర మంత్రి సంజయ్



**కరీంనగర్, జూలై 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రోజురోజుకు పెరుగుతున్న గుండెపోటు మరణాల నేపథ్యంలో సీపీఆర్ (కార్డియో పల్మోనరీ రీససిటేషన్) శిక్షణపై అవగాహనను పెంచాల్సిన అవసరముందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. సీపీఆర్తో ఎంతోమంది ప్రాణాలు నిలబడ్డాయని, ప్రతి ఇంటికి కనీసం ఒక్కరైనా ఈ శిక్షణ తీసుకోవాలని ఆయన సూచించారు. కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో డాక్టర్ రామక శ్రీనివాస్ కేంద్ర మంత్రిని కలిసి సీపీఆర్ పై తన సేవలను వివరించారు. ఈ సందర్భంగా పోస్టల్ డిపార్ట్మెంట్ రూపొందించిన సీపీఆర్ విషయక స్టాంప్‌ను బండి సంజయ్ ఆవిష్కరించారు. సీపీఆర్ కు సంబంధించి ప్రజల్లో బలమైన అవగాహన కల్పించేందుకు పోస్టల్ స్టాంప్ ముద్రించడం అభినందనీయమని మంత్రి ప్రశంసించారు. ఆసుపత్రికి చేరేలోపే తీవ్రమైన గుండెపోటు సంభవిస్తే ప్రాణహాని తలెత్తే అవకాశముందని, సీపీఆర్ ను ఉపయోగించి ప్రాణాలు కాపాడవచ్చని వివరించారు. ఆహార అలవాట్లు, మానసిక ఒత్తిడికి కారణంగా గుండె సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలంతా అవగాహన కలిగి ఉండాలని సూచించారు.కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు కపిలవాయి రవీందర్, పోస్టల్ శాఖ ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ జర్నలిస్టు వెంకటేశ్వర్లు మాతృమూర్తి అస్తమయం ...

- పరామర్శించిన టియుడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్



**మోత్కూర్, జూలై 16(నీలగిరి ఎక్స్ ప్రెస్)** సీనియర్ జర్నలిస్టు కూకట్పల్లి ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు బి.వెంకటేశ్వర్లు మాతృమూర్తి కిష్టమ్మ (96)ఆకస్మిక మృతి చెందారు. గత కొంతకాలంగా వృద్ధాప్య రుగ్మతలతో బాధపడుతున్న కిష్టమ్మ మంగళవారం రాత్రి మృతి చెందడం జరిగింది. కిష్టమ్మ మృతి పలువురిని దిగ్భ్రాంతికి గురి చేసింది. విషయం తెలిసిన టియుడబ్ల్యూజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ స్వర్గీయ కిష్టమ్మ కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు దివంగత కిష్టమ్మ కుటుంబ సభ్యులు బి.వెంకటేశ్వర్లు, క్రాంతీ కిష్టమ్మ మనవళ్లను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొలి దశ తెలంగాణ ఉద్యమంలో కిష్టమ్మ చేసిన సేవలను కొనియాడారు. స్వర్గీయ కిష్టమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో భాజపా సీనియర్ నాయకులు ఏనుగు జితేందర్ రెడ్డి, ప్రభుత్వ ఉపాధ్యాయులు సూరం శ్రీనివాస్ రెడ్డి టియుడబ్ల్యూజె నాయకులు యోగి, ఉప్పు సత్యనారాయణ, భాస్కర్, నజీర్, రెహమాన్ తదితరులు ఉన్నారు.

# బోనాల ఉత్సవాలకు ఎమ్మెల్యే దానం ను ఆహ్వానించిన జైల్ సింగ్ యూత్ అసోసియేషన్...



**జూబ్లీహిల్స్,జులై 16(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** జూబ్లీహిల్స్ డివిజన్ లోని జైల్ సింగ్ లో బోనాలు జరగనున్నాయి. ఈ బోనాల సందర్భంగా జరగనున్న ర్యాలీలో పాల్గొనాలని స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ ను యూత్ అసోసియేషన్ సభ్యులు ఆహ్వానించారు. అదేవిధంగా ఫిల్మ్ నగర్ 18 బస్తీల సంక్షేమ సంఘాల అధ్యక్షులు మామిడి నర్సింగ్ రావును కూడా యూత్ అసోసియేషన్ సభ్యులు ఆహ్వానించడం జరిగింది. ఆహ్వానించిన వారిలో సాయికిరణ్, పృద్వి, వెంకట్ తదితరులు ఉన్నారు.

# సీనియర్ జర్నలిస్టు వెంకటేశ్వర్లు కు యూనియన్ నేతల పరామర్శ...

**మోత్కూర్, జూలై 16(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** సీనియర్ జర్నలిస్టు కూకట్పల్లి ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు బి.వెంకటేశ్వర్లు మాతృమూర్తి కిష్టమ్మ 96 ఆకస్మిక మృతి చెందారు. గత కొంతకాలంగా వృద్ధాప్య రుగ్మతలతో బాధపడుతున్న కిష్టమ్మ మంగళవారం రాత్రి మృతి చెందడం జరిగింది. కిష్టమ్మ మృతి పలువురిని దిగ్భ్రాంతికి గురి చేసింది. స్వర్గీయ కిష్టమ్మ కు పలువురు జర్నలిస్టులు, ఉపాధ్యాయులు, వివిధ పార్టీల నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు దివంగత కిష్టమ్మ కుటుంబ సభ్యులు బి.వెంకటేశ్వర్లు, క్రాంతీ పరామర్శించారు. స్వర్గీయ కిష్టమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో భాజపా సీనియర్ నాయకులు ఏనుగు జితేందర్ రెడ్డి, ప్రభుత్వ ఉపాధ్యాయులు సూరం శ్రీనివాస్ రెడ్డి, టిఎప్డబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు పిసాటి జంగారెడ్డి, టియుడబ్ల్యూజే జర్నలిస్టులు నేతలు నజీర్, రెహమాన్, ఉప్పు సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

# అసంపూర్తిగా ఉన్న టీచర్స్ యూనియన్ భవనానికి నిధులు మంజూరు



**మెట్ పల్లి జూలై 16(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** టీచర్స్ యూనియన్ మెట్ పల్లి లో అసంపూర్తిగా ఉన్న సంఘ భవనానికి నిధులు కావాలి అని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు కి వినతి పత్రం సమర్పించగా SF నిధుల నుండి 3 లక్షలు మంజూరు చేయడం జరిగింది. వారి ఆదేశానుసారం MEO చంద్రశేఖర్ మరియు మెట్ పల్లి పట్టణ అధ్యక్షులు జెట్టి లింగం పని ప్రారంభించుటకు పూజా కార్యక్రమం నిర్ణయించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో మున్సిపల్ AE తిరుపతి, మరియు వర్క్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, ఉపాధ్యాయులు సిహెచ్ వేణుగోపాల్, లింగారెడ్డి, శ్యామ్, తయార్, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు జెట్టి లక్ష్మణ్, మండల అధ్యక్షులు పుల్లూరి వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు రాజగోపాల్, ఎలేష్, కట్కం రాజు, తదితరులు పాల్గొన్నారు.

# జిపిఎఫ్, పెండింగ్ బిల్లులపై తపస్ డిమాండ్




**కొత్తపల్లి, జూలై 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో కొత్తపల్లి మండలంలోని పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమనేని తిరుపతిరావు మాట్లాడుతూ, జిపిఎఫ్ డబ్బులకు పూర్తి వడ్డీ చెల్లించాలని, పెండింగ్ బిల్లులు, ఐదు డీఏలు, పీఆర్సీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హెచ్ఎం పోస్టుల భర్తీ, తరగతికి ఒక ఉపాధ్యాయుడి నియామకం, ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు కల్పించాలని సూచించారు. ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులకు జీతాలు, కేజీబీవీ ఉపాధ్యాయులకు టైం స్కేల్, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.కార్యక్రమంలో జిల్లా మీడియా ఇంచార్జ్ బి సత్యం, కార్యదర్శి జి కుమార్, మండల అధ్యక్షుడు జి శాంతిరాజ్, ప్రధాన కార్యదర్శి కె రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ విద్యార్థులకు ఘన సన్మానం



**కరీంనగర్, జూలై 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ 2022-23 10వ తరగతి విద్యార్థులు ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ఐటీ, ఎయిమ్స్ వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో సీట్లు సాధించడంతో, పాఠశాల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి వారిని ఘనంగా సన్మానించారువిద్యార్థులకు ప్రాథమిక దశ నుంచే ఫౌండేషన్ కోర్సులు అందించడంతో ఈ విజయాలు సాధ్యమయ్యాయని ఆయన పేర్కొన్నారు. 35 మంది విద్యార్థులు టాప్ ఇంజినీరింగ్ సంస్థల్లో, ఒకరు ఎయిమ్స్ హైదరాబాద్‌లో, నలుగురు మెడికల్ కళాశాలల్లో సీట్లు పొందినట్టు తెలిపారు.విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తల్లిదండ్రులు డా. నరేందర్ రెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ అభివృద్ధిపై బండి సంజయ్‌కు వినతి



**హుస్నాబాద్, జూలై 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్‌ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి కలిశారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని పలు సమస్యలపై ఆయన వినతి పత్రం అందజేశారు.అక్కన్నపేట మండల కేంద్రానికి అభివృద్ధి కార్యక్రమాల వివరాలు తెలియజేయగా, మంత్రి సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. సమావేశంలో మండల అధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి, టౌన్ మాజీ అధ్యక్షులు దొడ్డి శ్రీనివాస్, విద్యసాగర్ రెడ్డి పాల్గొన్నారు.

# పుష్ప అలంకరణ కార్యక్రమంలో పాల్గొన్న మక్తల్ మంత్రివర్యులు తమ్ముడు-వాకిటి శేషగిరి



**మక్తల్ జూలై 16(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం ఉట్కూరు మండలంలోని పులుమామిడి గ్రామంలో కీర్తిశేషులు రాగన్న గారి మనుమరాలని ఆశీర్వదించిన వాకిటి శేషగిరి ప్రేమతో పిలిచిన ఆహ్వానంను మన్నించి నిత్యం బిజీగా ఉండే మంత్రి గారి తమ్ముడు మా ఇంటికి ఒక సాధారణ మనిషిగా విచ్చేసి మా తమ్ముడి కూతురుకి ఆశీస్సులు అందించిన వాకిటి శేష గిరి అన్నకు ప్రత్యేక ధన్యవాదములు